# 19. అదృష్టవంతుడు

సాయంత్రం బీచ్‌లో శంకర్ కలిశాడు. ఆ మాటా యీ మాటా మాట్లాడు కుంటున్నాం.

"అన్నట్లు యీ మధ్య బలే తమాషా జరిగింది-" అన్నాడు వాడు. "మూడు రోజుల క్రితం మధ్యాహ్నం మూడింటికి చైనాబజార్ రోడ్‌లో ఆలోచిస్తూ నడుస్తున్నాను. నాకు ఎదురుగా ఒక పెద్దమనిషి వొస్తున్నాడు. ఆయన్ను నేను తప్పుకు పోవాలనుకున్నాను; కాని అతనే నా దారికి అడ్డువొచ్చి "మాష్టారూ!" అన్నాడు. వెనుక నుంచి పిలుస్తే మనను కాదేమో అనుకోవొచ్చు కాని, ఎదురుగా నిలబడి పిలిస్తే సందేహమేమిటి? నా ఆలోచనల్ని ఆపి అతన్ని తేరిపార జూచాను. బక్కపలచగా, ఎర్రగా వున్నాడు. ఖరీదైన గుడ్డలు వేసుకున్నాడు. చాలా శుభ్రంగానూ, ఠీవిగానూ వున్నాడు. పాతికేళ్ళు ఉంటవనుకుంటాను. చూడగానే మంచి వంశీకు డనిపించింది. చేతిలో అందమైన చిన్న తోలుసంచి వుంది..."

నేను వింటున్నాను. ఎప్పుడైతే ఎదురుపడిన వ్యక్తిని శంకర్ వర్ణించాడో, అప్పుడే అనుకున్నాను. వీడు చెప్పేవ్యక్తి సరిగ్గా వారం రోజులక్రితం నాకూ ఎదురయ్యాడు. కాస్సేపు మాట్లాడి రెండురూపాయలు సహాయం చేశాను కూడాను. ఆమాటే యీ శంకర్ కూడా చెపుతాడు. అందుకని కథలో నాకు 'ఇంటరెస్ట్' తగ్గింది. యథాలాపంగా వింటున్నాను.

"నేను తేరిపార జూడటం పూర్తయింది. ఏంకావాలన్నట్టు అతన్ని చూశాను... 'మీకు లక్ష్మీనారాయణగారు తెలుసా?" అన్నాడు. యీ మద్రాసు పట్టణంలో ఎంతోమంది లక్ష్మీనారాయణలు ఉండొచ్చు. వాళ్లల్లో ఎవరని? నాకు ఆ లక్ష్మీనారాయణ తెలిసివుంటాడని ఇతనెందుకు వూహించి వుంటాడు? "ఏ లక్ష్మీనారాయణ?" అన్నాను. "స్టూడియోలో ఆర్ట్ డైరెక్టర్‌గా వుంటాడండీ; ఇదివరకు మాంబళంలో ఉండేవాడు" అని ఆగాడు. స్టూడియోలతో మనకు సంబంధ మేమిటి? ఐనా యీ గొడవంతా దేనికని "నాకు తెలియదండీ!" అన్నాను... "ఏం లేదండీ- అతను ఇల్లు మార్చేశాడట. ఎక్కడికో నాకు తెలియదు'' అన్నా డా యువకుడు. 'స్టూడియోకు ఫోన్ చెయ్యకపోయారా?' అన్నాను. యీ డొంకతిరుగుడు వ్యవహారం వెనుక ఏదో ప్లాను వుందనే వాసన తగిలింది. 'చేశానండీ- వాళ్ళకూ తెలియదన్నారు' అన్నాడు. 'పోయి గంగలో- అన్నట్లు మద్రాసులో గంగ లేదు కనుక - కూం రివర్‌లో దూకు' అందామనుకున్నాను. కాని చాలా తీరుబడిగావుంది. అసలు ఇందాక నేను ఆలోచిస్తోంది; ఎక్కడికి పోతే కాలక్షేప మౌతుందా అనే. అందుకని లేని ఇంటరెస్టు కలిగించుకొని వీడి కథంతా విందామనుకున్నాను. చివరకు చెయ్యిజాపినప్పుడు కోప్పడి పంపవలసి వుంటుందని తెలుసు-"

తమాషా- సరిగ్గా నాతోనూ ఇదే సంభాషణ జరిపాడతను. అప్పుడు రెండు రూపాయిలూ ఇచ్చుకున్నప్పుడు నాకేమీ అనిపించలేదు కాని, శంకర్‌కు కూడా ఇలాటి కథే ఆరంభించాడని తెలియగానే, ఇదొక వ్యాపారంగానే సాగిస్తున్నా డనిపించింది... కాని నాకు జరిగిన అనుభవాన్ని నేను చెప్పదలుచుకోలేదు. ఎందుకంటే టోపీ పడ్డది కాక, చెప్పుకోవటం దేనికి? పోతే శంకర్ మొదటి నుంచీ యీ కథను గూర్చి ఆలోచిస్తూనే వున్నాడనుకుంటాను. నాకు కలిగిన అనేక అనుమానాలు వాడికీ కలిగినయ్. అందుకని, వాడి కథలోని అనుభూతుల్తో, ఆలోచనల్తో నా వాటిని పోల్చి చూసుకుంటున్నాను.

"నీకేం బాగుండలేదా?" అన్నాడు శంకర్.

"వింటున్నాను చెప్పు. చెప్పు. తరువాత ఏమన్నాడూ?" అన్నాను.

శంకర్ చెప్పసాగాడు. "మొదటినుంచీ వీడేదో మోసం చేసేందుకే ప్రయత్నిస్తున్నాడనే అభిప్రాయం కలిగింది నాకు. అనవసరపు ప్రశ్నలన్నీ వేయటం దేనికీ?"

నిజమే! ఇప్పుడు శంకర్ చెపుతూంటే, నేను బొత్తిగా ఆలోచించలేదనీ, అప్పుడు నా హృదయంతప్ప, మెదడేమీ పనిచేయలేదనీ అనిపించి, నన్ను నేను తిట్టుకుంటున్నాను.

"మీకు రాజమండ్రిలో నరసింహంగారు తెలిసివుంటారనుకుంటాను, కనీసం పేరన్నా వినివుంటారు" అన్నాడు వాడు. వీడు మొదటినుంచీ ఏవో పేర్లు వాగుతున్నాడు. యీ నరసింహావతారాలు ఆంధ్రదేశంలో, పోనీ, రాజమండ్రీలోనే నా తల వెంట్రుకలంతమంది ఉండొచ్చు. పేరు వినే వుంటారంటున్నాడు - దీన్ని బట్టి ఆయన

చాలా పేరు ప్రఖ్యాతులున్నవాడనే భావం స్ఫురిస్తోంది. ఐతేమాత్రం నాకు ఎందుకు తెలిసివుండాలి? 'సెంట్రల్ జైల్లో వున్నారా?' అందామన్నంత కోపం కూడా వొచ్చింది. కాని ఆ మాట అంటే ఇక లాభం లేదని వెళ్ళిపోతాడేమో, యీ ఉచిత వినోదం ఇంతలో అంతమౌతుందని భయం వేసింది. ఆయన నాకు తెలుసో, తెలియదో వివరించి చెప్పకుండా 'చెప్పండి–' అన్నాను."

ఇలాటి అనుమానాలు నాకెందుకు కలగలేదు? ఆ నరసింహం చాలా గొప్పవాడై ఉంటాడనీ, నాకు తెలియదనటం నన్ను నేను చిన్నపరుచుకోవటమనీ, 'విన్నాను లెండి' అన్నాను అన్నాడు. అందుకనే నాది వొఠ్ఠి మట్టిబుర్ర అనిపిస్తోంది.

"అంతా ముందుగానే ఆలోచించుకొన్న కథ కనుక, ధారాళంగా చెప్పుకొని పోతున్నాడు వాడు. 'నేను ఆ నరసింహంగారి అబ్బాయిని. ఏం లేదండి– మేము ఉదయం మెయిల్‌లో దిగాం... సెంట్రల్‌లో ఆ లక్ష్మీనారాయణను వెదకటంలో, ఆ ఆతృతలో, జనంలో పర్స్ పోయింది. చివరకు అతను కనిపించనూ లేదు. చిల్లర డబ్బులుంటే దాంతో హోటల్‌కు జేరాం' అన్నాడు. 'ఇంక సద్దుకోవయ్యా పెద్దమనిషీ!' అందామని నోటిదాకా వచ్చిందికాని, అనలేదు. ఎందుకంటే 'మేము' అంటున్నాడు వాడు. వీడి వెనుక కొంతమంది సైన్యమే ఉండొచ్చు. ఆ గుంపు కూడా ఒక్కరే కావొచ్చు, ఆడజాతికి సంబంధించిందై వుండాలనిపించి; వాణ్ని చెప్పనిచ్చాను..." అన్నాడు శంకర్.

వీడిదెంత మంచిబుర్ర! నాకిలాటి తర్కాలే రావేం? వాడు చెప్పాక తెలుసుకున్నాను కాని, చెప్పకముందే శంకర్ సరిగ్గా వూహించగలిగాడు. అనుభవం ఎంత వుంటేనేం, దాన్ని నిత్య జీవితంలో శంకర్‌లా ఉపయోగించుకో గలిగినవాళ్లు ఏ కొద్దిమందో!

శంకర్ చెప్పసాగాడు. "తన కథ ఎంతవరకూ నా మీద పనిచేస్తోందోనని నా మొహంలోకి చూశాడు. ఇది కనిపెట్టి నా ఆలోచనల్ని కనిపించకుండా, వాడి కథ జాగ్రత్తగా వింటూన్నట్లే నటించాను–"

వీడు నటించాడట! నేనేమో నమ్మాను. ప్రతి విషయాన్నీ ఎవరో ఒకరు మనకోసమని ఆలోచిస్తేనేకాని అర్థంకాని దుస్థితిలో వున్నాను నేను. నన్ను నేను విసర్జించుకోలేను కనుక భరిస్తున్నాను కాని...

"నేను ఒక్కణ్నే ఐతే ఫర్వాలేదండి. ఏదో వొక అవస్థ పడేవాణ్ని. కాని నాతో గర్భవతి ఐన నా చెల్లెలూ, ఆమెకు తోడుగా నా భార్యా వున్నారు. ఇక్కడే హోటల్‌లో దిగాం, ఇంటికి వైరిచ్చాను కూడాను. రేపటికి టి.ఎం.వో వొస్తుంది... మాది చాలా గొప్ప వంశమండి. చాలా ధనవంతులం. ఇక్కడ ఇలా ఇరుక్కుపొయ్యాను–' అన్నాడు వాడు– నా బుర్ర చాలా తీవ్రంగా పని చేస్తోంది. ఎవరి వంశం గొప్పదికాదు కనుక? ఇక ఐశ్వర్యమా– ఎవరికి ఉందో వారిదేకాని, ఇతరులకు సంబంధమేమిటి? వీడితో ఇద్దరు ఆడవాళ్ళున్నా రంటున్నాడు. ఇది తప్పకుండా అబద్ధమై వుండాలి. చూపమని

అడిగితే, వీడి బండారం బైట పడుతుంది. అప్పుడు వీడి నేరాన్ని రుజూ చేసినట్లవుతుంది కనుక, లాగి రెండు అంటించి వదలటమో, ఫ్లవర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, నాబోటి పెద్ద మనుషులు కొంతమంది మోసపోకుండా చేయటమో ఉత్తమమైన పనిగా తోచింది."

శంకర్ ఎంత లాజికల్‌గా ఆలోచించగలిగాడో చూస్తే వీడి శిష్యరికం కొన్నాళ్లు చేస్తేనే తప్ప నేను ఎందుకూ పనిరాకుండా పోతానేమో ననిపిస్తోంది. నాకూ ఇలాగే చెప్పాడు వాడు 'పాపం' అనిపించి జేబులో వున్న రెండు రూపాయిలూ ఇచ్చాను. జేబులో అంతకన్న లేకుండటంవల్ల; ఇంతకన్న టోపీ పడేందుకు వీలులేక పోయిందికాని, నా తెలివితేటలవల్ల మాత్రం కాదు... చెప్పుకుంటే సిగ్గుచేటు... కాని యీ శంకర్ ఏ పదిరోజుల క్రితమో, వాణ్ని ఫ్లవర్ బజార్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించి వుంటే, నేను ఫూల్ నయ్యేవాణ్ని కాదుకదా!

"ఇంకో విషయంకూడా ఆలోచించాను" అన్నాడు శంకర్. వీడి ఆలోచనా విధానానికి తన్మయుణ్నవుతున్నాను. ఆ గొప్పతనాన్ని మాటల్లో చెప్పలేక, మనసుపొందే వికాసానికి మూర్ఛపోతున్నాను. శంకర్ చెపుతున్నాడు. "వీడి రూపురేఖా విలాసాలూ, దుస్తుల ధారణ అదీ చూస్తే సద్వంశీకుడూ, భాగ్యవంతుడూ ఐవుండాలనేది స్పష్టమౌతోంది. అందుకనే ఇంతసేపు ఓపిగ్గా వింటున్నాను... కాని, వీడు నిజంగా భాగ్యవంతుడై, ఏమాత్రం ఆత్మాభిమాన మున్నవాడైనా రోడ్డున పొయ్యే ముక్కూ, మొహం తెలియనివాణ్ని అర్థిస్తాడా?"

నేనూ అలాగే అనుకున్నాను. కాని అర్థించే స్థితికే దిగాడనే జాలితోనే డబ్బు ఇచ్చాను. శంకర్ చెప్పే రకంగా ఆలోచించలేదు. అందుకుకూడా నేను వొఠ్ఠి దద్దమ్మననే బాధ!

"నువ్వూ నేనూ ఆ పరిస్థితుల్లో వుంటే ఏం చేస్తాం? ఇలా అర్థించలేం... ఆడవాళ్ళ మెడలోది ఏదన్నా తెగనమ్మి బైట పడతాం. వీడు నిజంగానే భాగ్యవంతుడైతే, వీడి వెంటవున్న భార్య మెడలోకానీ, చెల్లెలి మెడలోకానీ కొద్ది బంగారమన్నా ఉండివుండాలి కదా!' 'కొద్ది' అని ఎందుకు అంటున్నానంటే, వూరుకాని వూరు వెళ్తూ నగానట్రా వెంట తీసుకెళ్ళటం క్షేమకరం కాదని ఆలోచించేవాళ్లున్నారు, కాని బొత్తిగా బోసిమెడతో రారుగా? ఐనప్పుడు వీడు ఆ పని చేయకుండా, ఇలా నా వెంట పడటం ఏమిటి? వీడు చెప్పే ఆడజనాభాను చూస్తే వీడి రంగు బైట పడుతుంది-"

శంకర్‌కు జోహార్లు అర్పిద్దామనుకుంటున్నాను. కాని వాడి మూడ్ చెడితే, చెప్పే ధోరణి మారుతుందేమోనని భయం వేసింది. చివరకు ఎటూ వీడి మెడలో పూలదండవేసి బ్రహ్మరథం పట్టటం నాకు తప్పేట్లు లేదు- ఏం చేస్తాం- ఖర్మ!

శంకర్ చెప్పసాగాడు. "నేనిలా ఆలోచిస్తున్నానని వాడు తప్పకుండా వూహించి వుంటాడు. 'నానా అవస్థపడి చెల్లెల్ని స్టాన్లీ హాస్పిటల్‌లో జేర్చివొచ్చాను... ఇప్పుడు

ఏ టాక్సీ అన్నా వేసుకొని, ముందు ఆ లక్ష్మీనారాయణను కనుక్కొని, తరువాత యీ సంసారాన్ని అక్కడికి జేర్చాలి' అన్నాడు. టాక్సీ గీక్సీ అంటున్నాడు. బహుశా మంచి బతుకు బతుకుతూన్నవాడై ఉండొచ్చు. కాని ఇతరుల డబ్బు మీదకూడా టాక్సీయే ఎక్కాలనే వాడిలో, చింత చచ్చినా పులుపు చావకుండటం రుజూ ఐంది... వీడు చెప్పిన ఇద్దర్లోనూ, ఒకామెను హాస్పిటల్‌కు పంపించాడు – తెలివిగా ఆలోచించి. ఇక రెండో ఆమె సంగతి ఏమిటని అడుగుదా మనుకుంటున్నాను.

శంకర్ నిజంగా ఏ షెర్లాక్‌హోమ్ దగ్గిరో వుండవలసిన మనిషి. ఖర్మంకాలి ఇన్సూరెన్సు కంపెనీలో టైపిస్టయ్యాడు కాని, క్రైం బ్రాంచ్ పోలీసుల్లో వుంటే, బాగా రాణించేవాడు. కొంత ప్రజోపయోగం కూడా జరిగేది.

"వాడు చెప్పిందాన్నిబట్టి, టాక్సీ అదీ అన్నాడు కనుక, ఇరవై పాతిక రూపాయిల కన్నా గాలాం వేశాడనేది స్పష్టమైంది. ఐతే వీడికన్న తెలివితక్కువ వాడి దగ్గిరే ఈ పన్నాగం సాగుతుంది కాని, మన దగ్గిరా?" అన్నాడు శంకర్.

వీడి మస్కాలో పడినవాడు ఎటువంటివాడై వుంటాడో; శంకర్ అన్నమాటలన్నీ సరాసరి నాకు తగిలినవి. నన్ను దూషించినట్లే భావించాను. ఐతేనేం– తెలివితక్కువ వాడుకూడా మాటలు పడకపోతే, ఇంకెవరు పడతారు? నయం యీ సంగతి నాకు తప్ప వేరెవ్వరికీ తెలియదు.

శంకర్ తన గొప్పతనమంతా వెళ్ళబోసేందుకు మీసం దువ్వాడు. వాడి మొహం చూస్తూనే నేను కుంగిపొయ్యాను. వాడు– ఆ వెధవ మళ్ళీ కనిపిస్తే తందా మనిపించింది.

"వాడికి మనం కొరుకుడు బడటం లేదనే సంగతి గ్రహించాడు. ఆ మాత్రం తెలివితేటలు లేందే మద్రాసులో గౌరవంగా అడుక్కోవటం కుదురుతుందా మరి? వీడి అంతు తేలుద్దామనే నిశ్చయించుకున్నాను. వాడు అన్నాడు: 'మీకేదో అనుమానంగా వున్నట్లుంది... నాతో వొస్తే మా వాళ్ళను చూపుతాను, హోటల్ చాలా దగ్గిర' అన్నాడు..."

నాతోనూ వాడు అలాగే అన్నాడు. కాని ఎవరి స్త్రీలనో మనం చూడట మేమి టనిపించింది. అది కేవలం మానవత్వాన్ని పరాభవించటంగా తోచింది నాకు. ఐతే దాన్ని గౌరవించబోయి భంగపడ్డాను మరి.

"నేను అడగదల్చుకున్న ప్రశ్నకు నాకు జవాబు చెప్పాడు" అన్నాడు శంకర్. "మారు మాట్లాడకుండా వాడితో బయలుదేరాను. దారిలో ఎవ్వరమూ మాట్లాడలేదు. నాలుగైదు సందుగొందులు తిప్పి ఒక చిన్న హోటల్‌లోకి తీసుకెళ్ళాడు. బైట బోర్డు చూడకుంటే, ఇదేదో పాడుపడిన ఇల్లో, లేక భూతగృహమో ఐవుంటుందనుకునేవాణ్ని. నిజంగా అలాటిదే నేమోనని భయమూ, లోపల చావదన్ని చెవులుమూసి, జేబు ఖాళీ చేస్తారేమోననే అనుమానం పీకుతూనే వుంది..."

నా కుతూహలం రెట్టించింది. ఎందుకంటే కథ చీలింది. నేను పొందని అనుభూతి ఏదో వీడు పొందుతున్నాడు. నిజంగా అది భూతగృహమే ఐతే, శంకర్ తెలివితేటలకు చేయదల్చుకున్న మర్యాదలు అవసరమే కాదు; నేను కించపడాల్సిన అవసరమూ ఉండదు. చివరకు నేనే అదృష్టవంతుణ్ణయ్యేవాణ్ని.

"ఐతే... మనకు తక్కువ బలం వుందా?" అని శంకర్ ఒక్కసారి జబ్బలు చూసుకున్నాడు. ఆ మాట నిజమే! చిన్నప్పుడు కసరత్ చేసి కండరాల్ని పెంచాడు వీడు. వీణ్ని తెలివితేటల్లో ఎలా మించలేనో శారీరక బలాతిశయాల్లో కూడా అంతే! మిగిలిందల్లా, ఇంత గొప్పవాడితో నాకు మంచి స్నేహం వుందనే సంతృప్తి మాత్రమే.

"ఇద్దరు ముగ్గురైతే ఫర్వాలేదనిపించింది. ఎటుపోయి ఎటు వొస్తుందోనని సింహద్వారాలూ, అవసరమైతే దూసుకునేందుకు ఇతర దారులూ జాగ్రత్తగా గుర్తు పెట్టుకున్నాను. ఒకవేళ తారుమారైతే, రోడ్డుమీదికి దూకి, యీ భూతగృహాన్ని నేలమట్టం చేయించి, అద్భుతకార్యం చేసిన కీర్తికూడా దక్కించుకోగలను... అందుకని చాలా జాగ్రత్తగా వాణ్ని అనుసరించాను. బైటికి బొత్తిగా బాగుండకపోయినా లోపల హోటల్ పెద్దదిగానే వుంది. తగినంత బిజినెస్ లేకుండటంవల్ల సున్నానికి ఎదురుచూసే గోడలూ, దులిపేవాళ్ళులేక వేళ్ళాడేబూజూ, చిమ్మేవాళ్ళు లేక నేలమీద పేరుకున్న దుమ్మూ, అన్నిటినీ మించి, నీరసంగా, నిరుత్సాహంగా, పాతఫేము పడక కుర్చీలో సగంనిద్రలో వున్న ముసలి ప్రొప్రయిటరూ కనిపించారు. నేనేదో రూంకోసం వొచ్చానేమోనని, ఆ ప్రొప్రయిటర్ ఉలిక్కిపడిలేచి, ఆ రాజమండ్రి ఆయన వెంట ఉన్నందువల్ల, నిరాశతో మళ్ళీ నిద్రకు ఉపక్రమించాడు... హోటల్‌లో జనం చాలా పల్చగా వున్నారు. బహుశా చాలా చౌకబారు హోటలై వుంటుందని, ఈ జనాన్ని చూస్తే చెప్పవచ్చు... నేరస్థుణ్ని, తాను నేరస్థుడు కాదని రుజూ చేసుకునే అవకాశం ఇచ్చాను. అందుకనే వాడి వెనకాల నడవసాగాను... వాడు రెండో అంతస్తుమీదికి తీసుకొని వెళ్ళాడు. బైట బోలెడు ఖాళీస్థలం. పిట్ట గోడపక్కనుంచి కిందికి జారే పైప్‌లైను వుంది. అవసరమైతే దీన్ని పట్టుకుంటే, సరాసరి రోడ్డుమీదికి దిగవొచ్చు. ఇక ఏమీ భయం లేదనిపించింది-"

బతుకుతే శంకర్‌లాగు బతకాలి కాని, యీ బోడిబతుకేమిటనిపించింది. ఇంతకన్న ఎదురుగావున్న యీ సముద్రంలో పడటం మంచిది; కానీ వీడి కథంతా విన్నాక దీన్నిగూర్చి ఆలోచించవొచ్చు. చెప్పడేం- త్వరగా?

"ఈ అంతస్తు మీద ఒక్కటే గదివుంది-" అన్నాడు శంకర్. "హోటల్‌లోకల్లా ఇది మంచిగది అని బైటినుంచి చూస్తేనే తెలుస్తోంది- ఇక్కడ నాకో కొత్త ఆలోచన కలిగి; భయం వేసింది."

శంకర్‌కు కాస్త భయం వేయటం నాకు సంతోషంగానే వుంది. కాని యీ భయంతో పలాయన మంత్రం పఠించి యీ కథను ఇంతటితో ముగించేస్తాడేమోనని, నాకు భయం వేసింది.

"ఏమిటా భయం? ఎందుకు?" అన్నాను ఆతృతతో.

"విను మరి. వీడు ఇంతదూరం తీసుకొచ్చాడంటే, తన కోర్కె చాలా న్యాయసమ్మతమైనదేనని తప్పకుండా రుజూ చేయగలుగుతాడనేది స్పష్టమైంది" అన్నాడు శంకర్.

"ఐతే-?"

"ఐతే, ఇదంతా రుజూ చేసుకున్నాక, నేను తప్పక సహాయం చేయవలసివుంటుంది కదా?" అన్నాడు శంకర్. "అవస్థల్లో వున్న ఒక పెద్దమనిషికి, తను పెద్దమనిషేనని తెలుసుకున్నాక, సహాయపడటం తప్పని కాదు; అది మన కనీస బాధ్యతకూడాను. కాని మనకు మనమే సహాయం చేసుకోలేని స్థితిలో వున్నాం. నేను పొరబడ్డాను. అసలీ బెడదంతా పెట్టుకోకుండా, తొందర పని వున్నట్లు తప్పుకుంటే పొయ్యేది; తీరా ఇదంతా సరిజూసికాని డబ్బివ్వలేదనే అభిప్రాయాన్ని వాడిలో కలిగించి ఇంతదూరమూ వచ్చాను. ఇలా ఇరుక్కున్నాక, ఇంక చేసేదేమిటి?... ఆలోచించాను. సరే- ఐందేమో ఐంది... ఇప్పుడే వొస్తానని చెప్పి కాళ్ళకు బుద్ధి చెప్పవొచ్చు... జేబులో పదిహేడు రూపాయల చిల్లర వున్నవి. వీటిని వొదులుకోవాల్సి వస్తే, మన తెలివితేటలు ఉపకరించకుంటే పోనిమ్మనుకున్నాను. అంతకన్న ఏం చేస్తాను?"

శంకర్ మొహంలో ఒక తమాషా నిస్సహాయత నాకు కనిపించింది. చాలా తమాషాగా ఇరుక్కున్నాడు వీడు. ఆ డబ్బంతా వొదిలించుకొని బైటపడ్డానని చెపితే నాకు కాస్త మనశ్శాంతి ఉండును... కాదు... వీడి పక్కన వుంటే, వీడి గాలి సోకుతే నాకూ కాస్త బుర్ర పనిచేస్తోంది. అలా ఐవుండదు. ఎందుకంటే, అది వాడికి పరాభవమూ, అపజయమూ అవుతుంది కనుక; నిజంగానే అలా జరిగివుంటే, తెలివిగల వీడు ఎవ్వరికీ చెప్పడు కదా! మరి ఏం జరిగిందో, వాణ్ని చెప్పమని తొందరపెట్టకుండానే సాగించాడు.

"సరే కానిమ్మని మొండికేశాను. ఇది ఎలా తిరుగుతుందో చూసి; దాన్నిబట్టి ప్రవర్తించవొచ్చు. నేను మెదలకుండా నిలబడి, చుట్టూ వున్న మేడల్నీ, మేడలమీద చల్లగాలికోసం తిరుగులాడే యువతుల్నీ, పైన ఆరేసిన రకరకాల, రంగురంగుల చీరెల్నీ పరీక్షిస్తున్నాను. వాడు వెళ్లి గదితలుపు మెల్లిగా తట్టాడు. అదేదో సాంకేతిక గుర్తువలె తోచింది నాకు. మళ్ళీ అదే టకటక శబ్దం; ఇది తప్పకుండా ఏదో అర్థమున్న శబ్దమే ఐవుండాలనిపించింది... నేను కూడా గది తలుపువైపే చూస్తున్నాను. జాగర్త అని మనసు హెచ్చరిస్తూనే వుంది... గది తలుపు తెరవగానే కళ్లు జిగేలుమన్నాయంటే నమ్ము-"

ముందు నా కళ్ళు జిగేలు మంటున్నవి. ఎవడైనా తళతళలాడే బాకుతో ముందుకు దూకాడేమో? ఎంత వూహిస్తే ఏముందీ- శంకర్ చెప్పాల్సిందే కాని...

"ఏమైందీ?" అన్నాను, ఆశ్చర్యంతో.

"ఒక్క క్షణం నా కళ్లను నేను నమ్మలేకపొయ్యాను ఆమెను చూసి. వీడు ఆమె భర్తయినట్లయితే, వీడేమీ వెధవవాగుడు వాగనట్లయితే, తప్పకుండా గొప్ప వంశీయుడేనని రూఢిగా అనుకోవచ్చు. దబ్బపండులాటి శరీరచ్ఛాయలోనుంచి, మిలమిలా మెరిసే యవ్వనంతో మెరిసిపోతోందామె. ఆ కళ్లు చూస్తే ఏవో గొప్ప ఆలోచనలు, ఉజ్వలమైన తలపుల వెనుక వున్నట్లనిపించింది. గోముగా- వయ్యారంగా, నాజూగ్గా గది వాకిలి మీదికి వొంగి, ముందుకు పడిపోతూన్నట్లే వాలి, నన్ను చూసి చప్పున నిద్రనుంచి, తీయని వూహల్లోనుంచి మేలుకొన్నట్లు సర్దుకుంది. పరపురుషుని ఎదుట సద్వంశ సంచరించాల్సిన విధానాన్ని గుర్తుకు తెచ్చుకుందేమోననుకుంటాను. నిర్లక్ష్యంగావున్న పమిటను సర్దుకొని, తనలో తను నవ్వుకొని, ఇదంతా నేను కనిపెడుతూన్నా నేమోనని అనుమానం వేసి, బరువైన కనురెప్పల్ని ఎత్తి, నా వైపు ఓరగాచూసి, సిగ్గుతో తలవొంచుకుంది... నేను కూడా యీ దివ్యాంగన అందచందాలకు కళ్లను అలవరుస్తున్నాను. ఆ క్షణంలో నన్ను నేను మరిచిపొయ్యానంటే ఆశ్చర్య మేమిటి?- ఇదంతా చెప్పేందుకు ఇంతసేపు పట్టిందికాని-"

శంకర్ ఆగి మళ్లీ ఆ సుందర దృశ్యాన్ని కళ్లముందు సృష్టించుకునేందుకేమో ఆలోచిస్తున్నాడు. కళ్లు సగానికి మూసి తన్మయుడవుతున్నాడు. నాకు ఆమె దర్శనమైనా దొరకలేదు కదా నని కసిగా వుంది. అందులోనూ శంకర్‌లాటి పురుష పుంగవుడినే తల్లడిల్లేట్లు చేయగలిగిన ఆ సుందరాంగి ఎంత గొప్పగా, కలల్లో కనిపించి, మురిపించి, ఊరించి, ఆశపెట్టి మాయమయే దేవకన్యే ఐవుంటుందని అనుకుంటున్నాను... కాని ఇలా ఇద్దరమూ ఎవరి ఆలోచనల్లో వాళ్లం వుంటే కుదరదు. అందులోనూ కథ చాలా రసవత్తర ఘట్టానికి దిగుతూన్నట్లనిపిస్తోంది. నాకు మహా యీర్ష్యగా వుంది.

ఇప్పటికన్నా, ఆమెను చూడనే చూశాడు కనుక, విశేషించి ఆమె పెద్దింటి పడుచని మనవాడు గ్రహించాడు కనుక, వీడు చెప్పిన ఆ పదిహేడు రూపాయలూ సమర్పించి వొచ్చేసివుంటే, నాకు మహదానందంగా వుంటుంది. నావలెనే రెండు రూపాయిలూ వాడి మాటల కింద, మిగతా పదిహేనూ ఆమె దర్శనం కిందా సరిపెట్టవొచ్చు. వీడి వర్ణననుబట్టి నేనామెను వూహించుకోగలను కనుక, నాకు ఆ పదిహేనూ లాభమనన్నా అనుకుంటాను. ఊహలోనే ఏమైందని అడగొద్దు; చూస్తే మాత్రం ఏం వొరిగిందంటాను; మరీ ఆ చూపుకు పదిహేను రూపాయిల విలువైతే!

నా మధన నేను పడుతున్నాను కాని, కథ అలా ఎందుకు జరిగి వుంటుందీ? వీడేదో అఘాయిత్యం చేసినా చేసివుంటాడు; లేక వాళ్లే వీడి నోట్లో గుడ్డలు కుక్కి... గిద్దెడు మిరియాలు రాలేట్లు గుద్ది... అలాటి అపూర్వ సంఘటన, కర్ణోపేతమైన వాక్యాలు వినే అదృష్టం యీ నిర్భాగ్యుడికి దొరుకుతుందా?

శంకర్ ఆలోచనల్లోంచి ఊడిపడ్డాడు. బహుశా ఆ దృశ్యంలో కూడా ఇలాగే మగతగా వుండి, చప్పున వొళ్లు ధులపరించుకొని వుంటాడనేందుకు సందేహం లేదు.

"నేను నిశ్చేష్టుణ్నవటం చూసి వాడు చిరునవ్వు నవ్వాడు. ఆమె మళ్లీ వొకసారి అనవసరంగానే పమిట సర్దుకొని లోపలికి వెళ్ళింది. 'రండి సార్!' అన్నాడు. ఇంకెందుకు, నా సంగతేదో చెప్పి, ఇటునుంచి ఇటే దయ చేయమంటాడేమోనని భయం వేసింది. కాని వాడు ఆహ్వానించటం చూస్తే, నిజమైన సంస్కారంకూడా వున్నవాడిలాగే తోచింది. గదిలోకి వెళ్లాను. వాడు మంచంమీద కూర్చున్నాడు. నేను కుర్చీలో కూర్చున్నాను... పాపం- ఆమె మాత్రం నిలబడే వుంది. నాకు కష్టమేసి కూర్చోమందామనుకున్నాను. కాని ఎట్లా?... నా అవస్థ గ్రహించాడో ఏమో, వాడే 'ఇట్లా కూర్చోవే చక్కమ్మా!' అన్నాడు. ఇంత అందకత్తెకు యీ వెధవపేరుపెట్టి, తన నీచాభిరుచిని వెల్లడించినందుకు నాకు బాధ కలిగింది. ఆమె మాత్రం తమాషాగా, వంకరగా, నిష్ఠూరంగా మూతితిప్పి, మంచం ధగ్గిర వున్న చేతులు విరిగిన కుర్చీలో, ఆనీ ఆనకుండా, ఏటవాలుగా బాణం బద్దల్లే వొంకరగా, తమాషాగా కూర్చుంది-"

వీడు ఇన్ని వర్ణనల్తో చెపుతూంటే, చేతికి దొరికిన ఛాన్సు చెడగొట్టుకున్నానా అనే బాధ కలుగుతోంది నాకు. ఐతే శంకర్ ఏమిచెప్పినప్పటికీ, ఆ రాజమండ్రీవాడు డబ్బు గుంజేందుకే ఏంచేసినా చేస్తున్నాడనేది ధంకా బజాయించి చెప్పవొచ్చు. ఎందుకంటే మూడురోజులక్రితం శంకర్‌కు ఏం జరిగిందో, నాకు వారం రోజులక్రితం ఇంచుమించు అలాగే ఐంది కదా! వాడు ముందుకుసాగాడు. నేను మొదట్లోనే జారుకున్నాను- అంతే తేడా- దీన్నిబట్టి, పర్యవసానం వీడి డబ్బు అంతో ఇంతో వొదులుతుంది. ఐతే నా ఏడుపు ఏమిటంటే, యీ వెనకాల నిజంగానే ఒక ఆడది, అందులోనూ అప్సరస వున్నదంటే, నేనూ శంకర్‌లాగే ముందుకు సాగేవాణ్ని. తరువాత ఏమన్నా కానీ, అది వేరే సంగతి; అసలు ఇలా పోల్చుకోవటం వల్లనే నాలో రెండు విరుద్ధ అనుభవాల తాలూకు సంఘర్షణలు రేగి, సారాంశం ద్రావకంలాగు దహిస్తోంది. తమాషా ఏమిటంటే, వీడు చెప్పే యీ కథలో నేనే నాయకుణ్ణా అనిపించి, తాత్కాలికంగా మురుస్తున్నాను కాని, అంతలోనే నా అనుభవం అడ్డొచ్చి, నన్ను మేల్కొల్పి నా కలల్ని పాడుచేస్తూ, చూశావా ఎంతగొప్ప అవకాశాన్ని జారవిడుచుకున్నావో అని తిడుతోంది. నిజంగానే పొరపాటు జరిగింది కనుక, కిక్కురు మనకుండా పడున్నాను. ఏం చెయ్యను?... యీసారి వాడు కనిపిస్తే... కనిపిస్తాడని నమ్మక మేమిటి? కనిపించినా తొందరెందుకూ, శంకర్‌గాడు చెప్పేది ఇంకా పూర్తి కాలేదు. మళ్ళీ వర్తమానంలోకి పడ్డాను.

"వింటున్నావా?" అన్నాడు శంకర్.

ఎవడికోసం? ఇది ఒక విధంగా నా కథ కూడాను.

"ఆc. ఆc... ఆపావేం చెప్పు-" అన్నాను.

వాడొక సిగరెట్ వెలిగించాడు. బహుశా ఆ గదిలో కూడా ఇలాగే చేసి వుంటాడనుకుంటాను. ఎందుకంటే ఎటూ తోచని సన్నివేశంలో సిగరెట్ అనేక బాధల్ని మరిపింప జేస్తుంది. ముఖ్యంగా మనస్సు అటూ ఇటూ తన్నుకుంటుంటే, దాన్ని కనీసం తన మీద లగ్నమయేట్లు చేయగలది సిగరెట్టే!

"కథ సాగుతోంది. ఆమె వేసిన పోజ్ చూస్తున్నాను నేను. ఐతే చాలా నిర్లక్ష్యంగానూ, పట్టించుకోనట్లు నటించాను. పరస్త్రీ; అందులోనూ ఆమె భర్త నా పక్కనే వున్నాడాయె. మన పెద్దమనిషితనాన్ని పాడుచేసుకోలేం చూడు. 'ఏమండీ-' అన్నాడు వాడు. 'మన భార్యామణిగారు... పేరు శకుంతల... మన ముద్దు పేరు చక్కమ్మ!' వీడు ఎప్పుడైతే బహువచన ప్రయోగం చేసి 'మన' అని మీసం దువ్వుతూన్నట్లు పోజు వేసాడో నాకు అనుమానం వొచ్చింది. మన భార్యామణి ఏమిటి- నన్నొకణ్ని పక్కను పెట్టుకొని? అందులోనూ అనేకమంది భార్యలుండగా యీమె 'మణి' ఐందంటే మరోతండా వెనకరైలులో దిగుతోందనుకోవాలా? లేక వీడేం 'రాయల్‌వుయ్' లేదా 'పొయటిక్ వుయ్' ప్రయోగించాడా? ఇది అప్పుడే తేలదు; మనం తొందర పడ కూడదనుకున్నాను-"

శంకర్ "మనం" అనేప్పటికి, వాడికి వొచ్చినట్లే నాకూ పుట్టెడు అనుమానాలు వొచ్చినవి. "మనం" అంటున్నాడు, నే వొక్కణ్నేగా ఇప్పుడు వీడి పక్కన వున్నది. ఈ వ్యవహారం నాక్కూడా తెలుసని పసికట్టాడా? లేక వాడి అనుభూతుల్నే నేను పొందుతున్నాననే సంగతి తెలుసుకున్నాడా?... ఏమైనా వాడన్నట్లుగానే మనం తొందరపడకూడదు కదా!

"ఈమెను పరిచయం చేసినందుకు చాలా ఆనందమైంది. శకుంతల లాటి ముద్దుపేరును, చక్కమ్మలాటి మొద్దు పేరుగా ఎందుకు మార్చాడూ? ఏమే, గీమే అనటంకూడా నాకు నచ్చలేదు. ఎవరి భార్యను వాళ్ళు, వాళ్ల ఇష్టంవొచ్చినట్లు పిలుచు కుంటారనుకో- నా అభిప్రాయం మాత్రం చెప్పాను; అంతే!... ఎప్పుడైతే ఆమెను పరిచయం చేశాడో, ఆమె చిరునవ్వుతో 'నమస్కారమండి' అంది కోకిల కంఠంతో, వయ్యారంగా, భరత నాట్యం చేసేవాళ్ళు దణ్ణం పెట్టినట్లు. వీడి సంస్కారహీనతను, ఆమె సంస్కారం కప్పేసింది. వీడు "మన" అన్నాడంటే, యీ గర్వమంతా బహుశా యీ దేవకన్య తనదేననే ఐవుండా లనుకున్నాను... సరే, నేనూ నమస్కరించాను... "వీరు..." అని నా పేరు తెలియక ఆగాడు వాడు... ఇక్కడ నేనొక పొరబాటు చేశాను భాయీ!" అన్నాడు శంకరం.

"ఏమిటిది?" అన్నాను తాపీగా.

"రామనాథం, అని చెప్పేశాను. ఎందుకనో కాని, ఆ సమయంలో నీవు గుర్తొచ్చావు-"

ఓరి వెధవా! అనుభవించేది వీడూను, పేరు నాదీనా? ఐనా నేనెందుకు బాధపడాలి? మద్రాసులో ఎంతమంది రాములులేరు; రామనాథాలు లేరు; సీతలు లేరు; శకుంతలలు లేరు! నిజంగానే శంకర్ పేరు రామనాథమే ఐవుంటే నేనేం చేసేవాణ్ని?..

"పోనీలే చెపితే–" అన్నాను.

"అసలు అలా చెప్పబట్టే, నిన్ను చూడగానే యీ కథంతా గుర్తొచ్చింది" అన్నాడు వాడు.

ఈ విధంగానన్నా ముందు నా పేరు ఆమెక్కూడా పరిచయమైంది కదా అని అనుకుంటున్నాను. వెధవది పేరు వింటే ఏమౌతుందయ్యా అని మీరంటారేమో? వెనకటికి పేరన్నా తెలుసుకోకుండానే, కలలో కనిపించిన అనిరుద్ధుణ్ని ఉషాదేవి ప్రేమించలా?.... అందుకని తోక దగ్గిర మొదలైనప్పటికీ మరేం ప్రమాదం లేదు.

"పరిచయం పూర్తయ్యాక, తన బాధ్యత తీరినట్లే వూరుకున్నాడతను. వీడు చూడకుండా ఆమెను కన్నుల పండువగా చూద్దామని ఉంది. పరిస్థితి పరికిద్దామా అనుకుంటూండగా "చక్కమ్మా! కాస్త కాఫీ తెప్పిద్దూ" అన్నాడు వాడు. డబ్బుల్లేవని యీ మర్యాద లెందుకో నాకు అర్థంకాలేదు. ఐనా చిల్లర డబ్బుల వ్యవహారమే కదా, దీన్ని గూర్చి ఆలోచించటం ఎందుకని వూరుకున్నాను. "కుర్రాడు కింద వున్నాడు... పోయి చెప్పరాదూ?" అందామె మొహం చిట్లించి. వీడికి ఆమెమీద ఎంత అధికారమో, ఆమెకు వీడిమీద అంతకన్న ఎక్కువ అధికారమే వున్నట్లు తోచింది. ఇలాటి భార్య వుంటే ఎవరైనా నెత్తి నెక్కించుకుంటారు మరి!" అన్నాడు.

నేను కిక్కురు మనలేదు. ఎందుకంటే అలాటి భార్యంటూ ఉండటమంటే, ఆమె వుండాలి. అప్పుడు నేనే నెత్తి నెక్కించుకుంటానో, ఆమె ఆ అధికారాన్ని సాగిస్తుందో ఇప్పుడు చెప్పలేను కదా!

"వీడు కదులుతే బాగుండు ననిపించింది నాకు" అన్నాడు శంకర్. కదలకుంటే, "కాఫీ తాగుతే బాగుండేదే... ఇక్కడ దొరుకుతుందేమో?" అందా మనుకున్నాడు. ఇది వారి వసతి గృహం కనుక, వారే మనకు అన్ని ఏర్పాట్లు చేయాలిగా!... అదృష్టవశాత్తూ వాడు కదిలాడు. అనుమానంగా నావొంక చూస్తాడేమో ననుకున్నాను కాని, మనలాటి పెద్దమనిషిని ఎవడు అనుమానిస్తాడు?"

ఈసారి కూడా నేను ఎదిరించలేదు. ఈ "మన"లో వీడు నన్ను కలిపాడని తెలుసు. ఐతే ఏం చేస్తాం? వాడన్నది నిజమే మరి.

ఒక్క క్షణంలో చుట్టూ ఉన్న ప్రపంచమంతా స్తంభించినట్లయింది. నేనేమో ఈ కొత్త వాతావరణానికి అలవడేందుకు ఆగాను. ఆమె ఏం చేస్తోందో కూడా చూడలేదు... చప్పున బుర్రలో మెరుపు మెరిసినట్లు కొత్త ఆలోచనా, దాని వెనుక మళ్ళీ ఒక

అనుమానం, దాన్ని ఆనుకుని భయం కలిగినవి... ఈ వ్యవహారం మొదటినుంచీ కుంభకోణంగానే వుంది. దీని వెనుక ఏదో ఒక మహదాశయం, మోసం దాగి వున్నవని నా అంతరాత్మ ఘోషిస్తూనే వుంది. ఇప్పుడు కలిగిన అనుమానం ఏమిటంటే- ఈమె హఠాత్తుగా ఒక కేకవేస్తే, నలుగురూ జేరగానే 'వీడు నన్ను బలాత్కరిస్తున్నాడు' అని అంటే, ఇంకేమన్నా వుందా? ఒక్కసారి నా కొత్త బుష్ కోటు, తునాతునకలవటాన్ని భరించలేను. రాత్రి యింటి దగ్గిర, యూకలిప్టస్ ఆయిల్ పట్టించి, చేతులు పడిపోయేట్లు, ఇల్లాలు వొళ్ళంతా ఆవిరితో కాయటం, నేను, బాధతో మూలుగుతూ రాత్రంతా నిద్రలేకుండా గడపటం తలుచుకుంటేనే వొణుకు పుట్టింది... నలుగురూ జేరుతే, నా మాట ఎవరన్నా వింటారా? జరిగింది జరిగినట్లు చెపితేమట్టుకు, ఈమె మొహం చూస్తే, న్యాయదేవతకూడా సౌందర్యాన్నే కావిలించుకుంటుంది కదా! ఇలా ఇంకొకరికై తీర్పు చెప్పేందుకు పరుగెత్తికొచ్చిన గుంపులో నేను ఉన్నట్లయితే, ఆమె తనను బలాత్కరించాడనే మాట వినగానే, వాడి మొహం పగలగొట్టనూ? ఇది నిజమా, కాదా అని ఎవరు ఆలోచిస్తారు? అంత తీరిక ఎక్కడ? ఒకవేళ నిజంగా ఆమె వీణ్ని బలాత్కరించి వున్నప్పటికి, శిక్ష మాత్రం మొగాడే పొందాలి. సారంగధరుడి కథ తెలియకుంటేగా? ఇక ఇంత అందమైన యువతితో ఒంటరిగా మాట్లాడే అవకాశం దొరుకుతే, ఆమెను మాటల్తో, చూపుల్తో వశపరుచుకుంటే, వీళ్లెవ్వరికీ అభ్యంతరం లేదు. అప్పుడామె కేకలు వెయ్యదుగా- అసలు తెలిసేందుకు. కాని దేహబలం ఉన్నవాడు, అంత గొప్ప ఆకర్షణకు లోబడిపోయి పశువైతే, వాణ్ని ఏ పరిస్థితిల్లోనూ సమాజం క్షమించదు. ఆ పరిస్థితుల్లో తాము వుంటే ఏంచేసేవాళ్లని ఆలోచించరు... వెనకటికి కీచకుడు సైరంధ్రివెంట పడ్డాడంటే, చివరకు తెలిసివుండి కూడా ప్రాణాలు కూడా లెక్కచెయ్యక, యముడు నూనెలో వేయిస్తాడన్నా ఇష్టపడ్డాడేకాని వెనక్కు తిరగలేదు. మనం కీచకుణ్ని నీచుడంటాం కాని, యీ సైరంధ్రి కోసం ఆమె భర్తల్లో ఎవరైనా, కీచకునివలె "కీడు" అనుభవించేందుకు సిద్ధంగా వున్నారా? వాడి ప్రణయావేశం ఎంత బలవత్తరమైందో చూడు!"

వీడు అసలు కథ వొదిలిపెట్టాడెందుకో అనిపిస్తోంది. కొంపదీసి ఆ కీచకుడే అయ్యాడేమో? అలా ఐవుంటే, యీ వెధవ పని ఎందుకు చేశావని అడక్కముందే తన ఆర్గ్యుమెంట్స్ చెపుతున్నాడేమో?

"బలాత్కరించావా?" అన్నాను.

"ఉహుఁ. ఇదంతా నాలో కలిగిన వూహలు. అలా ఐనట్లయితే మన పరువు మర్యాదలు ఇంకేమన్నా ఉంటయ్యా? ఇస్త్రీ చొక్కాలచాటున, తెల్లని బట్టల వెనుక, దొంగ వేషాలు అడ్డంగా జాగర్తగా కాపాడుకొస్తున్న యీ పెద్దమనిషితనమంతా మట్టిపాలేగా... ఆ సందులో నన్ను ఎరిగినవాళ్లెవ్వరూ ఉండేందుకు వీల్లేదనేదొక్కటి మినహాగా మరో ఎడ్వాంటేజీ ఏమిటి?"

"జరిగిం దేమిటో చెప్పరా బాబూ– చంపక!"

శంకర్ చెప్పసాగాడు: "నాకు యీ ఆలోచనలే రాకుంటే, అసలు కథ కదిలేది కాదనుకో. ఎప్పుడైతే యీ బితుకు ఆరంభమైనదో, ఎందుకన్నా మంచిది, వాడొచ్చేదాకా బైట పిట్టగోడ దగ్గిర నిలబడదామనుకొన్నాను. లేచి నిలబడి ఒక్కసారి ఆమెవైపు చూశాను. ఆమె అరచేతుల్లో గడ్డం ఆనించి, వయ్యారంగా, ఠీవిగా, నిర్లక్ష్యంగా నావైపే చూస్తోంది. ఆ చూపులు పలకరించి, పులకరింపజేసి ఎంతగా ఆకర్షిస్తున్నవో చెప్పలేను. నిలబడ్డచోటనే అతుక్కుపొయ్యాను... కాని అంతలో ఆమె పరదార అని గుర్తొచ్చి, ఇంత నీచానికి దిగుతూన్నందుకు అంతరాత్మ ఘోష వినలేక, మరో ఆలోచన లేకుండా, ఎలాగో బెదిరి, బైటపడ్డాను... ఎందుకనోకాని ఆమె పిలుస్తుందనుకున్నాను. కాని అలాటిదేమీ జరగలేదు. చివరకు వెనక్కు తిరిగే ధైర్యంకూడా లేక, పిట్టగోడ మీదనుంచి బజార్లోకి చూడసాగాను...

"నాలో వున్న పశువుకూ, సంస్కారికీ రామరావణ యుద్ధం ఆరంభమైంది" అన్నాడు శంకర్ యుద్ధంలో ఫిరంగిపొగలను పోలిన సిగరెట్టు పొగల్ని వూదుతూ. "నాకు తెలుసు– సంస్కారి తెలివితో, మాటల్తో జయించగలడేకాని, పశువు తిరగబడితే తుక్కయిపోయి శంకరగిరి మాన్యాలు పడతాడని. అందుకనే జాగర్త పడ్డాను. ఎలాగూ తగిలించుకున్నాం కనుక, వీడికి ఏదో కాస్త ముట్టచెప్పి, "నీ చావు నీవే చావు" అని చెప్పి తోక ముడుద్దామనే నిశ్చయానికి వొచ్చాను."

నా గుండె గతుక్కుమన్నది. శంకర్ ఇంతదూరం వెళ్ళి, చివరకు చెవులు ఝాడించుకుంటూ వొచ్చేందుకే నిశ్చయించుకున్నాడంటే, నాకు చాలా అసంతృప్తిగా వుంది. వీడికి జరిగే అవమానం కోసం గంతులేసిన హృదయం, ఆ రాజమండ్రివాడికి అనవసరంగా జరుగబొయ్యే మేలును గూర్చి బాధపడింది.

"అంతా వూహించుకుని బెదిరిపొయ్యావనుకుంటాను" అన్నాను, నాయకుడికి కాస్త ప్రోత్సాహాన్ని అందిస్తూ.

"ఆఁ. నేనూ అదే అనుకున్నాను" అన్నాడు శంకర్. "జాగర్తగా ఆలోచిస్తే యీ రాజమండ్రివాడికి డబ్బు అవసరం వుంది; ఐతే అఘాయిత్యాలు చేసేపాటి మనిషిలాగు లేడు. చాలా సాత్వీకంగానే, ఎదుటివాడికి బాధ లేకుండా పుచ్చుకోవాలని చూడబట్టేగా, అంతదూరం లాక్కొచ్చి తన పెద్ద మనిషితనాన్ని నాకు రుజూ చేసింది... గదిలో పెద్ద టిఫిన్ కారేజి, ఒక బెడ్డింగు, మరచెంబు ఇత్యాది చూసినట్లు జ్ఞాపకం. తిరిగిచూస్తే టిఫిన్ కారేజి కనిపిస్తూవుంది కూడాను. దీన్నిబట్టి వీళ్ళు ప్రయాణీకులై వుంటారనేది నమ్మవొచ్చు. వీడు చెప్పిన కథంతా నిజమనే నమ్మకముకూడా నాకు కలుగుతోంది. ఎటూ నా అంతట నేనే నా భాగాన్ని ధర్మంగా ఇస్తాను కనుక, ఒకవేళ దురుద్దేశమున్నా, వాడు దొంకతిరుగుడు పద్ధతికి దిగడని నమ్మాను."

"నమ్మి–?" అన్నాను, ఆతృతతో.

"నమ్మగానే ఉరకటమేనా? వాడికోసం ఎదురుచూస్తున్నాను. గదిలోకి పోయి కూర్చుందామా అనే ధైర్యం వొచ్చిందికాని, యీ కాస్తలోనూ తొందరపడటం ఎందుకని వూరుకున్నాను... ఇంతలో దేవుడల్లే వాడు రానేవొచ్చాడు. వాడి వెనకాల కాఫీకప్పుల్తో కుర్రాడు వున్నాడు. 'ఏమండీ! ఇక్కడ నిలబడ్డారు?" అన్నాడు వాడు. ఇదంతా ఎలా చెప్పేది? 'ఊరికనే గాలికోసం-' అన్నాను. 'గదిలో ఫాన్‌వుందే' అన్నాడు వాడు. నేనేం జవాబు చెప్పలేదు. వాడివెంట గదిలోకి వెళ్ళాను. టేబిల్‌మీద వున్న ఒక కప్పును ఆమె నాకు అందించింది. ఆమె మొహంలోకి దొంగచాటుగా చూస్తూ అప్పటికే దాదాపు చల్లారిన కాఫీ తాగాను; నిజానికి రుచిలేకపోయినా, వాతావరణం ఆహ్లాదంగా ఉండబట్టి అదే అమృతం లాగుంది... రెండు నిమిషాలపాటు నిశ్శబ్దం ఆ గదిలో తాండవించింది. చివరకు వాడే అన్నాడు. 'మీరు దేవుడల్లే కనిపించారు, ఒక్క సహాయం చెయ్యండి'. 'చేస్తాను' అని నేను అంటానని ఆగినట్లున్నాడు. కాని, నేను అనలేదు. వాడు చెప్పేది పూర్తి చెయ్యమన్నట్లు వూరుకున్నాను. 'ఏం లేదు... నేను మాంబళం వెళ్ళి ఆ లక్ష్మీనారాయణ కొంప కోసం వెదికి వొస్తాను... మా ఆవిడకు యీ చోటు అసలే కొత్త. పెద్ద పట్టణమని భయంకూడాను. అందుకనే నగా, నట్రా తేలేదు- మీరుకాస్త యీమెకు తోడుగావుంటే-' అన్నాడు. ఆమెను ఆపాదమస్తకం చూసే అవకాశం చిక్కింది. మెడలో పసుపుతాటికి వేళ్ళాడే మంగళసూత్రం తప్ప వేరేమీ లేదు. అందుకనే వీడి కీ అవస్థ పట్టివుంటుంది... తన భార్యకు ముక్కూ మొహం తెలియని నన్ను కాపలా కూర్చోపెట్టేవాడు. నామీద ఎంత నమ్మకం ఉంచగలుగుతున్నాడో ఆలోచించాను. ఒక రకంగా వాడికి సహాయం చేసినట్లూ వుంటుంది, యీ సుందరాంగితో కాలక్షేపం జరిగినట్లూ వుంటుందనిపించింది. క్షణంలో వీళ్ళిద్దర్నీ, నేను సంవత్సరాల తరబడి ఎరుగుదునా అనిపించింది. మనుషులు దగ్గరయేందుకు కాలం కన్న, మనసులే ఎక్కువ పని చేస్తవనుకుంటాను. నేను సరే అందా మనుకుంటూండగానే 'నేను మహా ఐతే ఏడింటికల్లా వొచ్చేస్తాను. మిమ్ము ఇబ్బందిపెట్టను' అన్నాడు వాడు... నాకు టైం విచారం లేదు. నిజానికి ఎలా యీ కాలాన్ని గడపాలా అనే చూస్తున్నాను... యీ ప్రపోజల్ నాకు బాగానే వుంది కాని, ఆమెకు ఎలావుందో తెలుసుకోవాలనే కుతూహలంతో ఆమె వైపు చూశాను. ఆమె ముఖం చిట్లించి, వాడు చెప్పేమాటల్ని జాగర్తగా వింటోంది. బహుశా ఇలా ఉండటం యీ నారీరత్నానికి ఇష్టమై వుండదు. కనుక అసమ్మతిని ప్రకటిద్దామా అని ఆలోచిస్తున్నాను- వాడీ పరిస్థితంతా వాసన పట్టినట్లున్నాడు. 'ఛక్కమ్మా! మరేం భయం లేదు. వీరు మనవారే... మాట్లాడుకుంటూ కూర్చోండి... లేదా ఆ పెట్టెలో పేక వుందిగా, పేకాట ఆడండి' అన్నాడు వాడు. 'సరే... మీరు త్వరగా రండి' అందామె. వాడు నిలబడ్డాడుకాని, కదలలేదు. ఎందుకనో తెలుసు నాకు. అందుకనే ఐదు రూపాయిల కాగితం చేతికి ఇచ్చాను... వాడు మారుమాట్లాడకుండా జారుకున్నాడు."

"తరువాత?" అన్నాను.

శంకర్ ఆలోచనలో పడ్డాడు - బహుశా ఆ దృశ్యాన్ని సరిగ్గా జ్ఞాపకం చేసుకుంటున్నాడేమో? లేక, అక్కడకూడా వాతావరణానికి తగినట్లుగా ప్రవర్తించటం ఎలాగా అని ఆలోచించి వుండటంవల్ల, ఆ ఎఫెక్టుకోసం ఆగాడేమో? తొందరపెట్టి వాడి ఏకాగ్రతకు భంగం కలిగించదలచ లేదు.

"గాజులు గల్లుమనేప్పటికి తలెత్తి చూశాను. ఆమె వయ్యారంగా అద్దంముందు కూర్చొని, జడలో మల్లెపూలచెండు పెడుతోంది. గదంతా ఆ వాసనతో ఘుమ్మన్నది. తల తిరిగి, శరీరంలోకి చోటుచాలక, మనస్సు ఏదో విశాలమైన ప్రపంచంలోకి దూసుకొని పోతూన్నట్లయింది. నాకు నేనే హెచ్చరికలు చేసుకుంటున్నాను! తొందరపడి రసాభాస అవకుండా నిలవతొక్కుకుంటున్నాను. వాడి అభిప్రాయంకానీ, యీమె అభిప్రాయంకానీ స్పష్టంగా తెలియటం లేదు... తెలుసుకునేదాకా వేచి ఉండాల్సిందే కదా! ఆమె వయ్యారంగా మంచంమీద కూర్చొని రెండు చేతుల్నీ వెనక్కు ఆన్చి సూటిగా నా వైపు చూసింది. నేనూ అలాగే చూస్తే ఆమె మొహం తిప్పేసుకుంటుందేమో ననుకున్నాను. కాని చూడకుండా ఉండలేకపొయ్యాను. ఐతే ఆమె మొహం తిప్పేసుకోలేదు. ముందుకు వొంగుతూ "మీరు సినిమాల్లో పనిచేస్తూ వుంటారా?" అంది. బహుశా ఆ లక్ష్మీ నారాయణ సంగతి చెప్పగలనని అనుకుందేమో? 'ఊహుఁ' అన్నాను. 'సినిమావాళ్ళతో మంచి స్నేహం వుందా?' అంది ... లక్ష్మీనారాయణ సంగతికోసం కాకుండా, ఇంకదేనికో యీమె యీ ప్రశ్న వేసి వుంటుందనిపించింది. అందుకనే ఒక్కక్షణం ఆలోచించి 'ఏదో ఒకరిద్దరు డైరెక్టర్లు తెలుసు' అన్నాను. నిజానికి నాకు ఎవ్వరూ తెలియదు... ఆమె కళ్ళు ఉజ్వలంగా మెరిసినవి. ఆమె ఆలోచనలు సముద్రతరంగాలల్లే కళ్ళల్లోంచి బైటికి ఉరుకుతున్నయ్యా అనిపించింది. క్షణంలో ముఖంలో వికాసం వొచ్చి, యవ్వనపు పొంగు తాలూకు శోభ ఆమె శరీరమంతా విద్యుత్‌వలె ప్రవహించి ప్రకాశించింది... ఆ స్థితిలో ఆమెను చూడాల్సిందే కాని, ఆ సౌందర్యం, ఆ యవ్వనం, ఠీవి, ఆనందం- ఇంకా నాకు తెలియని, తెలిసినా నేను చెప్పలేని అనేకం గుమికూడి, మానవత్వాన్ని, పుస్తకాల్లో చదివే, ఊహించుకునే, కలలుకనే దివ్యత్వానికి మార్చినవి ... కాని భాయీ! నీ వామెను చూసి వుంటే నిజంగా మతిపోగొట్టుకునేవాడివి సుమా!"

వింటేనే మతిపోతూన్నట్లుంటే, చూస్తే మూర్ఛ పొయ్యేవాణ్ని. శంకర్ నిలవతొక్కుకో గలిగాడు కనుక సరిపోయింది. లేకుంటే వీడు కూడా నా వలెనే దుర్బలుడై మూర్ఛపోయివుంటే, మూర్ఛలోంచి బైటపడేవరకూ నేనిక్కడ కూర్చోవటం అనవసరం! కనుక రాబొయ్యే దృశ్యం ఏమిటోననే ఆతృతతో గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"ఆమె చప్పునలేచి, పెట్టి తెరిచి, ఒక పెద్ద కవరు తెచ్చింది. నా కుర్చీకి పక్కగా, నన్ను ఆనుకుంటూ నిలబడి కవరు నా చేతికి ఇస్తూ 'చూడండి... ఇందులో నా

ఫోటోలు ఉన్నవి' అంది. నేను ఒక్కొక్క ఫొటో చూస్తున్నాను. చాలా ఆకర్షణీయంగానూ, అందంగానూ ఉన్నవి. ప్రతి ఫోజులోనూ, విలాసం, విరహం, వయ్యారం, ఆకర్షణ, కవ్వింపు ఉన్నవి. ఏ పురుషుడన్నా చూస్తే, యీమె చేతికి చిక్కుతే బాగుండుననీ, మనకు దక్కదనే బాధతో కుంగిపోవటం జరుగుతుంది. సినిమాలో జేరేందుకే యీమె యీ ఫోటోలు తీయించుకొని ఉంటుంది. కాని తెర సంగతి ఎవ్వరూ ఆలోచించరు ఆ బొమ్మలు చూస్తే. లొట్టలు వేస్తూ, ముందుగా యీమెను అనుభవించే ప్రయత్నాలే చేస్తారు. అది పూర్తయ్యాక, సినిమాలకు పనికివొస్తుందో, రాదో కూడా ఎవ్వరూ ఆలోచించరు... దగ్గిర ఉండటం ప్రమాదమని తరిమేస్తారు..."

ఇలా చేయటం అన్యాయం, అక్రమం అనిపించి వుంటాయి వాడికి. అందుకే శంకర్ తన సానుభూతిని, అన్యాయాన్ని నిరోధించలేని అశక్తతను ఒక నిట్టూర్పుద్వారా కక్కాడు. మళ్ళీ చెప్పటం సాగించాడు:

"నేను ఊహించిన యీ మాటల్నే శకుంతల చెప్పింది. సినిమాలో జేరాలనే ఉద్దేశ్యంతో ఆమె ఇల్లూ, వాకిలి, గొడ్డుగోదా, భర్తా, ఆత్మ బంధువులందర్నీ వొదిలి మద్రాసు వొచ్చింది. ఆరు నెలల క్రితం, యీ ఆశలన్నీ వాడే ఆ రాజమండ్రివాడే, పెట్టాడు. "వాడు నీ భర్తకాదా" అన్నాను. "అదేలెండి.. ప్రస్తుతానికి వాడే దిక్కు నాకు. ఏనాడైతే గడపదాటానో, ఆనాడే నా గొయ్యి నేను తీసుకొని అందులో పడ్డాను. వెనక్కుపోవటం అసంభవం... ఐనా వెనక్కు వెళ్ళటం ఎందుకులెండి, చావదలుచుకుంటే మద్రాసులో ఎన్ని మార్గాలు లేవు?" అందామె, జాలి గొలిపేట్లుగా! నేను ద్రవించి పొయ్యానంటే ఆశ్చర్య మేమిటి? ఈ సినిమా కళకోసం ఆమె చేసిన త్యాగాలు ఎవరిక్కావాలి? ఇదంతా కళాభిమానమంటే ఎవరైనా ఒప్పుకుంటారా? కాని ఏ కళారాధకులు ఇంతకన్న ఎక్కువ త్యాగం చేసివుంటారో ఆలోచించు-"అన్నాడు శంకర్.

ఉత్సాహంగా వున్న మూడ్‌పోయి విషాధమేఘం కమ్మింది. ఆమె అంటే నాకూ జాలి కలుగుతోంది. కాని ఏం చేస్తాం? మన చేతుల్లో ఏముంది?

శంకర్ చెప్పసాగాడు. "ఎక్కడా ప్రయత్నించలేదా అని అడిగాను. 'అడ్డమైనవాళ్ళ కాళ్ళూ పట్టుకున్నాం. మొదట్లో వాళ్ళు చెప్పేమాటలు చూస్తే, క్షణంలో తారాపథంలో మెరుస్తూన్నట్లే తోచేది. ఏదో అద్భుత జీవితం ముందర వున్నదనే ఆశతో వాళ్ళేంచేసినా వూరుకున్నాను. ఇదంతా కళ కోసమేనని సరిపెట్టుకున్నాను. మానాభిమానాల్ని కూడా బలి ఇచ్చాను' అందామె. 'పాపం' అని నిట్టూర్చాను. 'ప్రతివాడూ నాతోడి అనుభవం కోసం ప్రయత్నించేవాడే కాని, మీలా జాలిపడినవాళ్ళెవ్వరూ లేరు... నేనూ ఏదో ఫిఫ్తుఫారం దాకా చదివాను. కాస్త పాడగలను. డాన్సు కూడా నేర్చుకున్నాను... మొహమాటం లేకుండా మీరు చెప్పండి... నేను సినిమాల్లోకి పనికిరానా?' అందామె. నేను సినిమావాణ్ని కాకపోయినా, అందచందాల విషయం తూచవలసివొస్తే, నేను తెరమీద చూసే ఏ గొప్ప సినిమాతారకూ యీమె అందంలో తీసిపోదు. మరి సినిమాల్లోకి

ఎందుకు పనికి రాలేదో నాకు తెలియదు. ఆ మాట అన్నప్పుడు ఆమె ఉబ్బిపోయింది. పాపం– ఎంత అల్పసంతోషి! అందుకనే ఆ రాజమండ్రీవాడు యీమెను లేపుకొచ్చాడు. 'మీరు మీకు తెలిసిన డైరెక్టర్లతో చెప్పి, ఏమైనా సహాయం చేయగలరా?' అందామె. 'చెప్పలేను... కనుక్కుంటాను!' అన్నాను. ఆమె దిగులుగా కూర్చుంది. 'తప్పకుండా చేస్తాను' అని నేను మాట ఇచ్చినట్లయితే, చాలా సంతోషించేదనుకుంటాను. అలా అననందుకు నామీద నాకే కోపం వొచ్చింది. 'దిగులుపడితే అవుతుందా? ప్రయత్నిద్దాం' అన్నాను. 'సరే– కనుక్కోండి... ఏం చేస్తాం? మద్రాసులో దిగిన రోజున మూడువేల రూపాయిలు చేతిలో వున్నవి. ఆనాడు వున్న సామానంతా, ఇప్పుడీ గదిలో వుంది– నామీద వున్న బంగారం మినహాగా. ఆ బరువు తగ్గి, జీవితమే భారమైంది... ఏమిటో ఈ పిచ్చి అనిపిస్తుంది. ఇంత ఐనప్పటికీ వెధవ ఆశ మనసులో పీకుతూనే వుంటుంది. ఒక్కొక్కప్పుడు నా ఈ పేకమేడల మీద జుగుప్స కలుగుతుంది. ఇంత దిగజారిపోయినా, విచారం కలగటానికి బదులు, ఎలాగైనా సినిమాల్లోజేరి, సాధిద్దామనే వుంటుంది –' ఆమె కళ్లు చెమ్మగిల్లినవి. నేనూ ఏడ్చే పర్యంతమయ్యాను. ఈమెకు ఏ మాటలు చెప్పి మళ్ళీ సంతోషపెట్టగలనా అని ఆలోచిస్తున్నాను. ఈ గొడవంతా ముందే తెలిసివుంటే, నేనే డైరెక్టర్ పోజువేసేవాణ్ని! చేతులారా ఆనందాన్ని విషాదంగా మార్చాను..."

నాకూ అలాగేవుంది మరి. ఏమై వుంటుందో నేను ముందుగా ఊహించుకొని శంకర్‌పట్ల జలసీ పెంచుకున్నాను కాని, యీ నాయకి మీద జాలిగా వుంది. ఐతే ఇంతతో వీడు తిరిగొచ్చేరకం కాదని తెలుసు.

శంకర్ సాగించాడు: "ఆమె కళ్ళు తుడుచుకుంది. ఒక్కసారి వొళ్లు విరుచుకుంది. క్షణంలో ఆ విషాదాన్నంతా దుమ్ముదులిపినట్లు దులిపెయ్యగలిగింది. తిరిగి ఆ సంతోషమంతా క్రమంగా ముఖంలోకి తెప్పించింది. ఇంత గొప్పగా నటించగలామె సినిమాల్లోకి పనికిరాలేదంటే నమ్మలేకపోతున్నాను. 'ఈనాడు ఈ కథంతా చెప్పి మీ మనసు పాడుచేశాను కదూ! ఏం అనుకోకండి–' అంది చిరునవ్వుతో నా ముఖాన్ని పమిట చెంగుతో తుడుస్తూ. ఆమెలాగు తేలిగ్గా నేను మూడ్ మార్చుకోలేకుండా ఉన్నాను. ఇతర అనుమానాలు కూడా వేధిస్తూన్నవి. ఏమిటి యీమె ఉద్దేశ్యం? 'మద్రాసులో వుంటూ హోటల్లో వుండటమెందుకూ?' అన్నాను. 'ఇల్లు దొరకలేదు. రెండేసి నెలలూ, మూడేసి నెలల ఎడ్వాన్సు ఇవ్వలేం. ఐనా నాబోటివాళ్ళకు ఇల్లెక్కడ దొరుకుతయ్‌లెండి' అంది. 'అతను... ఇప్పుడొస్తాడా?' అన్నాను. 'ఏం ఛస్తాడో? నన్ను ఉద్ధరించేందుకే నా కొంగు పట్టుకొని వేళ్ళాడుతూన్నట్లు నటిస్తాడు... వెధవ! వాడు పోతే నేను ఏడుస్తూ కూర్చుంటా ననుకుంటాడు... కాని వాడు మళ్ళీ నాకు కనిపించకుండా పోతే, పీడ విరగడయిందనుకుంటాను. నా ఒక్క జీవితమే నాకు కష్టంగా వుంటే, వీడి బరువుకూడా మోయాల్సి వొచ్చింది!' అందామె. వాణ్ని ఇలా నీచంగా మాట్లాడటం నాకు చాలా సంతోషంగా వుంది. వాడు నాతో అతికేట్లుగా

ఎన్ని అబద్ధాలాడాడు! యీమె ఆ అబద్ధాలన్నీ మాట్లాడలేకపోయింది. ఇంత అమాయకురాలు కనుకనే జీవితమంతా నాశనం చేసుకుంది. వాడు తెలివికలవాడు కనుక, మోసగాడు కనుక, తన జీవితం కోసం, యీమె జీవితాన్ని బలిపెట్టాడు.”

శంకర్ సర్దుకు కూర్చొని ఆలోచనలో పడ్డాడు. కథలో లాగే “మూడ్” మార్చుకునేందుకు తంటాలు పడుతున్నట్లు తోచింది నాకు. వాడు చెప్పటంలో చూపే చాకచక్యాన్ని బట్టే నేనూ మూడ్ మార్చుకోగలను. అందుకే ఎదురు చూస్తున్నాను.

“... ఇప్పుడేం చెయ్యాలి? యీ ఆలోచన నన్ను వేధిస్తోంది. ఈమె దీన చరిత్రను మరి భరించలేను. ఆ సంగతి ఆమెకూ తెలుసుననుకుంటాను. ఏమైనా సహాయం చేయగలమా అంటే, అది వీలులేదు... ఆమె వైపు చూద్దును; ఇంతకుముందు చెప్పినదంతా ఎవరి అనుభూతోనన్నట్లు, మామూలు మనిషయింది. ఎంతో ఉత్సాహంతో, భూతకాలానికి సంబంధం లేకుండా, వర్తమానంలోకి వొచ్చి పడింది. ఒక్కసారి గదిలో ఆమె పచారు చేసేప్పటికి, మత్తెక్కించే మల్లెల వాసన గదంతా నిండింది. వాతావరణమంతా కళ్లముందు చూస్తూండగానే మారింది. నేను నిశ్చేష్టుణ్నయ్యాను. ఆమె వయ్యారంగా నా దగ్గరికి వొచ్చి నవ్వుతూ బుగ్గగిల్లి ‘ఏమిటి ఆలోచిస్తున్నారు?’ అంది. ఆమె కష్టాలు అనుభవిస్తూనే, సుఖాలకు అడ్డదోవలు కనిపెట్టగలిగిందా అనిపిస్తోంది. ‘ఎందుకొచ్చిన వెధవ ఆలోచనలు?’ అని స్ఫురింప జేసేట్లుగా అడిగింది. ‘ఏం లేదు’ అన్నాను. ... ఆ తరువాత సంభాషణ ఎలా సాగించాలో కూడా అర్థం కావటం లేదు. ఎవరి చావు వాళ్లు చస్తారు; యీ మానవ జీవితాలన్నిటినీ సమీకరించి, మనం బాధపడి, పరిష్కరించేదేమిటి – వెళ్ళిపోదామా అనుకుంటున్నాను. నిజానికి మొదట్లో యీమెను అనుభవించాలనే తీవ్ర వాంఛ నన్ను తరిమింది; కాల్చేసింది. కానీ తీరా ఆమె లభ్యమయే సూచనలు కనిపిస్తూన్నప్పటికీ, మనస్సు వెనక్కు లాగుతోంది. ఇంత బాధపడే జీవిని, సంస్కారమంటూవున్న నేను కూడా పిండుకునేందుకు చూస్తున్నట్లనిపించి, ఒక రకం విరక్తి కలిగింది. మనస్సు పొందే అనుభూతులు చిత్ర విచిత్రాలుగా ఉంటవి సుమా!” అన్నాడు శంకర్.

వాడన్న చివరిమాట కాచి వడబోసిన సత్యమే అనిపిస్తోంది. ఆ స్థితిలో వాడి మనోవికారాలేమిటో, వింటున్న నా మనోవికారాలూ అవే అనిపిస్తూన్నవి. నేను ఆమెను చూడనందుకూ, ఆమె మధురమైన కంఠస్వరంనుంచి యీ విషాదగాథంతా విననందుకు విచారపడలేదు; ఒక విధంగా యీ సాలెగూటిలోకి ఇరుక్కోకపోవటం అదృష్టమే ననుకుంటున్నాను. కాని మనసులో మరో మూల, ఎవరెట్లాపోయినా, ఏది ఏమైనా, మనకోసం ఎవరు చితికిపోయినా, స్వార్థచింత వేధిస్తూ, అనుభవించక చేయిజార్చుకోవటం తగనిపనిగా తోచి బాధిస్తోంది. వాంఛకూ, సంస్కారానికీ పోట్లాటపడుతోంది ... ఐతే శంకర్ మనో వికారం ఇలా ఉండ దేమోనని, సిగ్గుపడుతున్నాను కూడాను.

శంకర్ చెప్పసాగాడు: "–నిర్ధారణ చేసుకోకముందే, ఆమె గది తలుపు గడియ వేసింది. ఏదో ఘోరం జరుగబోతోందని, దాన్ని నేను భరించలేననీ తోచి, కాళ్లు గజగజలాడినయ్. ఐతే వెళ్ళిపోబుద్ధి కావటం లేదు... ఇంకా వ్యవధి వుంది లెమ్మని అంతరాత్మ మూలుగుతూ వుంది. నిజమే లెమ్మని సరిపెట్టుకుంటున్నాను... ఆమె వయ్యారంగా పక్కమీద, ఎడమ అరచేతి మీద బుగ్గ ఆన్చి, శకుంతల పోజులో పడుకొని, కళ్ళతోనే ఆహ్వానిస్తోంది. ఆ క్షణంలో నన్ను నేను మరిచిపోయాను. నా ఆలోచనలూ, సంస్కారం, సానుభూతి మొదలైనవన్నీ ఏమైనవో తెలియదు. ఒక్కటే దృష్టి... యీమె నాదైపోయింది. ఎంతకాలం అనొద్దు. తృప్తికి కాలంతో సంబంధ మేమిటి? దివ్యానుభవం ఒక్క క్షణమైతే మాత్రమేం? ఇంతవరకూ నేను పట్టుకొని వేళ్ళాడిన ఆదర్శాలూ, ఆశయాలూ పటాపంచలైనవి; ఆ బంధనాలనుంచి తెంచుకున్నాను; కొండమీదినుంచి అన్ని అడ్డంకుల్నీ దాటే మహా నదివలె, ఉరుకులు పరుగుల్తో నాలో రక్తం ప్రవహించింది. అప్పుడు తలుచుకుంటే, మానవుడికీ, దేవతలకూ భేదమల్లా ఈ "పశుత్వం"లోనే ఉన్నదని తోస్తుంది. యీ పశుత్వాన్ని మనం సంస్కారం చాటున దాచుకుంటూ, దాన్ని హేయమనీ, నీచమనీ ద్వేషిస్తున్నామే కాని, దాన్ని వొదిలించుకో లేకుండా ఉన్నాం కదా! కొన్ని సందర్భాలలో దాన్ని నిరోధించ గలిగినప్పటికీ, మరికొన్ని చోట్ల అది మనను జయించే తీరుతోంది– ఐతే, ఇక్కడ నా సంస్కారి సోదిలోకి కూడా రాకుండా పొయ్యాడు; నేనందుకు విచారించలేదు. ఎందుకంటే యీ సంస్కారి మర్నాడు మళ్లీ ఇస్త్రీబట్టల చాటున ప్రత్యక్షమౌతాడు; యీ సంగతి నాకూ, నేను చెప్పగా వినేవాళ్ళకూ తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. పోతే, ఆమె భూలోకాన్ని పుస్తకాల్లో చదివి, కలలు కనే స్వర్గలోకంగా మార్చింది; దానికి నేను పోగొట్టుకున్నది, రహస్యంగా నా సంస్కారాన్ని! అందుకనే నేను విచారించలేదనేది–"

శంకర్‌మీద నాకు కోపం వొస్తోంది. వీడేదో చేయరాని పని చేశాడనిపించి బాధ కలిగింది. కాదేమో? నాకు చిక్కని ఆ దివ్యానుభూతిని వీడు పొందటమే కాకుండా, దాన్నిగూర్చి నాకు వివరంగా చెప్పి, నన్ను ఊరించి, కవ్వించి, బాధపెట్టా డనుకుంటాను. వీడి స్థితిలోవుంటే నేనూ అలాగే ప్రవర్తించి వుండేవాణ్ణేమోకాని, ఆ మాట ఇప్పుడు ఒప్పుకోలేకుండా వున్నాను. శంకర్ అనుభవిస్తూన్నప్పుడు పొందిన సుఖంలో, కొంత భాగాన్ని చెప్పేప్పుడు పొందుతూండటంవల్ల, నాకు మరీ కసిగా వుంది.

"బైటి ప్రపంచం ఏమైంది? టైం ఎంతయి ఉంటుంది? నేను ఎక్కడవున్నాను? ఇలాటి వెధవ ప్రశ్నలు రానేలేదు. ఆ గది ఒక ప్రత్యేక ప్రపంచం. ఆమెకు నేనూ, నాకు ఆమె యీ ప్రపంచంలో మానవులం. ఇతర అడ్డంకులూ ఆలోచనలూ లేవు. స్త్రీ వ్యామోహంలో ఎన్నో అఘాయిత్యాలు చేస్తారనీ, హాస్యాస్పదంగా ప్రవర్తిస్తారనీ, మనం ఎన్నో కథలు విని నవ్వి, ఆ మూర్ఖుల్ని గూర్చి కసిగా విమర్శించి, ఆనందిస్తుంటాం... కాని మనమే ఆ మూర్ఖుల్లో(?) ఒకళ్ళమైనప్పుడు తెలిసొస్తుంది. వాళ్ళందరిమీద ఎంతో

సానుభూతి కలుగుతుంది మరి!... తమాషా- నామీద నాకు జాలి కలగలేదు సరికదా, ఎంత అదృష్టం లేకుంటే తలవని తలంపుగా, యీ మెరుపు తీగె చేతికి చిక్కుతుంది? యీమె నాలో ఐక్యమైపోయి, నేను జీవితంలో ఎరుగని అనుభూతిని ప్రసాదిస్తుంది? అలాటి అనుభూతినే ఆమె పొంది ఉండొచ్చేమో? లేక నా కోసమై సర్వస్వం త్యాగంచేసి ఉండొచ్చు. ఏమైతే నాకేం- నేను మూర్ఛపోదగింది, నా అనుభూతి కారణంగానే!... కాలం గడిచినకొద్దీ మళ్ళీ నేను 'నేను' అవుతున్నాను. దేనిమీదన్నా నీకు అయిష్టం కలగటం మొదలెట్టిందంటే తృప్తిపడ్డావన్న మాట! భోజనం చేశాక, భోజనమంటే మొహం మొత్తుతుంది. నా స్థితి అలాగే ఐంది. మళ్ళీ యీ సాధారణ ప్రపంచం, ఇల్లు, వాకిలి, పిల్లలు మొదలైనవన్నీ నన్ను మేల్కొల్పి తరుముతున్నవి. ఏమిటి ఇంత నీచంగా దిగజారిపొయ్యానా అనిపించింది... టైంచూస్తే పది గంటలైంది. ఆకలి వేస్తోంది. 'భోజనం తెప్పించనా?' అందామె కిలకిలా నవ్వుతూ. 'ఉహూ. ఇంటికి వెళ్తాను' అన్నాను. ఆమె దిగులుగా చూసింది. ఆమె మొహం చూస్తే నాకు భయం వేసింది. ఈమె ఇప్పుడిక్కడ ఏడుస్తూ కూర్చుంటుందేమో? ఆడవాళ్ళూ, అందులోనూ ప్రియురాండ్రు ఏడుస్తూంటే నాకు మహా చిరాకు. 'మీరు వెళ్తే నేనొక్కతెనూ ఉండలేనండి' అందామె ముద్దుగా. వాడొచ్చినా బాగుండు. ఆమె హృదయపూర్వకంగా యీ మాట అన్నదా, లేక మాటవరసకు అన్నదా అని నేను ఆలోచించ లేదు. ఈమెను ఎలాగో సమాధానపరిచి ఇక్కణ్నుంచి బైటపడకపోతే, నాకు ఊపిరి ఆడేట్లు కూడా లేదు... వీళ్ళను అంటించుకోవటం తేలికేగాని, వొదిలించుకోవటం కష్టం-"

ఇంతసేపు ఈమెను ఆకాశానికి ఎత్తి, ఇప్పుడు నేలమీద దొర్లిస్తున్నాడేమా అని ఆలోచిస్తున్నాను. అంతే, - ఏదైనా అంతేనేమో? ఆకర్షణలో వున్న బలం, అనుభవం పూర్తయ్యాక ఏముంటుంది? చేతికి చిక్కేదాకా రత్నాలుగా కనిపించేవి, చేతులోకి రాగానే రాళ్లుగా మారతవి కాబోలు!

"వెంటనే బయలుదేరకుంటే, చివరి బస్ అందదు. నాకేమో ఈ ప్రదేశంలో వుండబుద్ధి కావటం లేదు. 'అతను వొస్తాడులే... నాకు పని వుంది... రేపు వొస్తాను' అన్నాను. 'రేపు ఎప్పుడొస్తారు?' అందామె. నాకు చాలా బాధ కలిగింది. ఈ "రేపు" నేను రాను; మళ్ళీ ఎప్పటికీ ఇటు రాను. దైవికంగా ఈమె ఎక్కడన్నా ఎదురైనా ఆమెను మాట్లాడించను సరికదా, చూసికూడా చూడనట్లు, నేను మహా నీతిపరు డైనట్లుగా, పరస్త్రీని కన్నెత్తి చూడకుండానే గౌరవించటానికి ఉగ్గుతో అలవాటైనట్లే ప్రవర్తిస్తాను. ఈ సంగతి నాకు బాగా తెలుసు. కాని ఎప్పుడైతే "రేపు" అని ఆశపెట్టానో అమాయకంగా నమ్మిందామె. ఆమెను నమ్మించటమంటే మోసపుచ్చటమే కదాననే బాధ కలిగింది నాకు. లేక ఆమెకు మాత్రం, యీ మాత్రం జీవితానుభవం లేకుండా వుంటుందా? మొగవాళ్ళ మాటలు నీళ్ళలో మూటలని తెలియకుండా వుంటుందా?

తెలిసే నమ్మినట్లు నటిస్తోందేమో? చావనీ- ఎలాగైతే నాకేం? ఆమెను నమ్మిస్తే - ప్రస్తుతానికి బైటపడటమే నా మతం-"

నాకు చాలా కష్టంగా వుంది. "అంత గొప్ప అనుభవాన్ని పొందాక ఆమె అంటే నీకంత బరువనిపించిందెందుకనీ?" అన్నాను.

"అనుభవమనేది ఒక రకం మురికిలాటి దనుకుంటాను. అది పేరుకొన్నాక, దానినుంచి విముక్తి కావాలి. ఐనా మనం పెద్ద మనుషులం. ఎప్పుడో ఎక్కడో కాలు జారాం. ఒకసారి జారామని, ప్రతిసారీ జారాలా? తీరా అనుభవించాక, ఇంతా ఏడుస్తే ఇంతేనా అనిపిస్తుంది. ఏమైతేనేం - యీ బజారు సరుకు మనకు తగింది కాదు-" అన్నాడు శంకర్.

దేవకన్య దగ్గిర మొదలై, బజారు సరుకైందీమె. కాని శంకర్ ఒకటి ఆలోచించ లేదనుకుంటాను. యీమెను బజారు సరుగ్గా పేర్కొనేందుకు శంకర్‌లాటి పెద్ద మనుషులే కారణం. వాళ్ళు స్వప్నాల్లో పొందే ఆ గొప్ప అనుభూతుల్ని ఈమెలాటి వాళ్ళు నిజం చేయటమే వాళ్ళు చేసిన నేరం; యీ మాటలు నేను పైకి అనలేను. అన్నా శంకర్ ఖండిస్తాడనీ, అనవసరంగా బాధపడతాడనీ వూరుకున్నాను.

"రేపు సాయింత్రం వొస్తానుగా" అన్నానామెతో. 'తప్పకుండా?' అంది. 'నీతోడు' అన్నాను. ఒక్కో ఇబ్బందిని గడిచేందుకు ఎంత బరువైన మాటలన్నా సరే వృథా చేస్తాం. మాటల్తో అయే పనులకు కష్టపడం కూడాను. 'మీ ఎడ్రస్ ఏమిటి!' అందామె... ఇక్కడే గొప్ప పొరపాటు జరిగింది-" అన్నాడు శంకర్. అని నా మొహంలోకి చూశాడు. నేను మాట్లాడాలనేమో?

"ఏమిటిది?" అన్నాను.

"ఏం లేదు- కాగితం మీద నీ పేరు, నీ ఎడ్రసూ రాసిచ్చాను..." అన్నాడు వాడు.

నేను అదిరిపొయ్యాను. యీ వెధవ, వీడు అనుభవించి, నా ఎడ్రస్ ఇవ్వట మేమిటి? వీడు అక్కడికి వెళ్ళకుంటే, ఆమె వీడిల్లు వెతుక్కుంటూ, నా ఇంటికి వొచ్చిందంటే - ఇంకేమన్నా వుందా? మా ఆవిడ చీపురుతో ముందు యీమెను సత్కరించి (ఎందుకంటే ఆమె వెంటనే వెళ్ళిపొయ్యేది, నేనైతే ఉండేవాణ్నే కనుక, నా సంగతి తర్వాత చూడొచ్చు) నానా రభసా చేయదూ? ఆమె అలా రావటం, ఆమె ప్రణయావేశాన్ని చూపుగాక! వెధవ ప్రణయం - ప్రళయంగా మారుతుందంటే ఎవడిక్కావాలి? అందులోనూ ఏ పాపమూ ఎరుగని నా మీదికా? ఇంతకుముందు, ఆమెవైపు ఆకర్షించబడిన మనస్సు, ఇప్పుడు మండిపడుతోంది... ఐతే ఆమె తప్పేం వుందీ? వీడు నా ఎడ్రస్ ఇవ్వకుంటే-

"నీకేమన్నా బుద్ధివుందా?" అన్నాను.

"అను... ఎన్నన్నా పడతాను. ఆ స్థితిలో నాకు తెలియకుండానే ఒక రకం నిజం కక్కేశాను; ఇప్పుడేమనుకొని ఏం లాభం... ఐనా ఆమె రాదులే" అన్నాడు.

"ఎలా తెలుసూ? నీ రసికత్వాన్ని తలుచుకొని వొస్తుందేమో?"

"మూడురోజులైంది కదా - ఇంతవరకూ రానిది..." అంటున్నాడు శంకర్.

"ఇక ముందురాదని ఎట్లా? నేను ఇంట్లో లేనప్పుడు, ఇవ్వాళ వొచ్చిందేమో?"

"రాదుగా చూడు... ఆమె ఫక్తు బిజినెస్‌రా భాయీ! యీ చిల్లర వ్యాపారంలో కొత్త కొత్త కాతాదార్లు కావాలి. పాతవాళ్లయితే అంత కలిసి రారు" అన్నాడు శంకర్.

"ఏదో నా కళ్ళనీళ్ళు తుడిచేందుకు ఇదంతా చెపుతున్నావ్" అన్నాను.

"కాదు... కాదు..." అన్నాడు శంకర్. "అంతా వింటే నీకే అర్థమౌతుంది. ఎప్పుడైతే నేను వెళ్ళేందుకు ఆమె అంగీకరించిందో, చప్పున ఒక్కసారి తల దువ్వి, లేచి నిలబడ్డాను. 'మీ దగ్గిర ఏమన్నా డబ్బుంటే' అందామె. అసలు ధర్మంగానే ఇచ్చేందుకు సిద్ధపడినవాణ్నాయె. అందులోనూ ఇంత గొప్ప అనుభవాన్నిచ్చాక; ఆమెను అన్యాయం చేయటానికి నా మనసొప్పలేదు. జేబులో వున్న పన్నెండు రూపాయిలూ ఇచ్చాను. చిల్లరేదో వుంటే బస్సు చార్జీకి ఉంచుకున్నాను. ఆమె యీ డబ్బుకు చాలా సంతోషిస్తుం దనుకున్నాను. కాని 'ఇంతేనా?' అంది మొహాన్ని అసంతృప్తితో ముడుచుకొని. ఆమె ఇలా అంటుందంటే, లేక ముందుగానే తనకు 'ఇంత కావాలి' అని వుంటే, వ్యవహారాన్ని ఇంతదూరం రానిచ్చేవాణ్ని కాదు. తీరా ఆమె అలా అనేప్పటికి, శరీరమంతా శీతలం కమ్మినట్లయింది. ఆమె నాకిచ్చిన ఆనందానికి విలువకట్టలేననుకో. మరొకరు, ఏ భాగ్యవంతుడో, ఇంకా చాలా ఎక్కువ ఇవ్వగలిగినవాడు, అత్యధికంగా ఆమెకు ఇవ్వగలిగితే, ఇస్తాడుగాక! నా తాహతుకు యీ మొత్తమే చాలా ఎక్కువ. ఇంకా పదిరోజులు గడుస్తేనేకాని నెల పూర్తవదు. ఎట్లాగా అని ఒక పక్క ఆలోచన ఆరంభమైంది. ఈ స్థితిలో ఆమె మీద నాకు ఎంత మండిపోయివుంటుందో ఆలోచించు. ఒకరకంగా నన్ను అసమర్థుడిగా అన్యాయం చేసినవాడల్లే చూస్తూ అవమానించినట్లే తోచింది. ఇదొక వెధవ రభస ఆరంభమౌతుందేమోననే భయం కూడా కలుగుతోంది; మరోవైపు చివరిబస్ నన్ను హెచ్చరిస్తోంది. ఒక్క గుటకమింగి 'ఇప్పటికి ఇంతేవుంది... నేనేం కలగని వొచ్చానా? రేపు వస్తానుగా-' అన్నాను. ఆమె బుంగమూతి పెట్టి, చురచురా చూస్తూ ఏదో గొణిగింది. మాటలైతే స్పష్టంగా వినిపించలేదు కాని, నాకు అర్థమైనంతవరకూ 'ప్రతివాడూ పెద్ద బుష్ షర్టులు వేసి, సూటు వేసి, డాబుసరిగా కనిపిస్తాడు. తీరా జేబులో చిల్లర డబ్బులు తప్ప నోట్లకట్టలుండవు. వున్నా ఆడకూతురికి ఇచ్చేందుకు ప్రాణం ఒప్పదు. అనుభవించేందుకు మాత్రం నేను ముందంటే, నేను ముందని ఉరుకుతారు...హోటల్ అద్దె తిండీ తిప్పలకన్నా సరిపోదు- వెధవబతుకు' అని వుండాలి. యీ వెధవ బతుకు తనదే కాకుండా, నాది కూడానని తోచింది. తీపి

పదార్థం తిన్నాక, సముద్రపునీరు తాగినట్లయింది. సైతాన్ వెంట తరుముతూన్నంత ఆతృత కలిగి, ఆమె గొణుగుడుకు ఆమెనే వొదిలి ఉరుకులు పరుగులమీద, బస్సులో పడ్డాననుకో–"

"ఇంకేం! ఆమెకు ఏదో ఆశకూడా పెట్టావ్ కనుక, ఆమె తప్పకుండా నా కొంప వెతుక్కుంటూ వొస్తుంది" అన్నాను దిగులుతో.

"రాదు భాయీ! ఆమె యీ వ్యాపారంలో ఢక్కా మొక్కీలు తిన్నది. వాడు... ఆ రాజమండ్రీవాడు బేరాలు తెస్తూంటాడు– అంతే కాని, ఆమె గదినుంచి కదలదు."

"బేరముంటే, ఈ విధానం దేనికి?" అన్నాను. నా ఇంటికి రాదులెమ్మని నన్ను నేను సర్దుకుంటున్నాను. ఒకవేళ వొచ్చినా చేయగలిగింది లేదు.

"ఇదో కొత్త పద్ధతి. నాబోటి పెద్దమనిషిని నడిబజార్లో పట్టుకొని 'అమ్మాయివుంది కావాలా?' అంటే మొహం పగిలేట్లు అంటించినా అంటించవొచ్చు, లేక ఈ కొత్తవాణ్ని నమ్మి వీడివెంట వెళ్లేందుకు నిరాకరించనూ వొచ్చు. ఇంకోటేమిటంటే, వీడు బ్రోకర్ అని తెలుస్తే ఎవడూ బజార్లో మాట్లాడేందుకు ఒప్పుకోడు. బహుశా అలాటి పని చేయటానికి వాడికి మనస్కరించనట్లే నటన. వెంటవెళ్తే ఆమె వసూలు చేస్తుంది; వెళ్ళకుంటే వీడే అందినవరకూ గుంజుకుంటాడు. పదిమందిలో ఒకళ్ళన్నా నాలాగే ఆలోచించి వెళ్ళకుండా వుండరు. అందులోనూ, వీడి భార్యగా ఆమె పరిచయమైతే, ఆమెను గెల్చుకోవటంలో తన పురుషత్వమే జయించినంత తృప్తి కలుగుతుంది. ముందుగానే ఇది డబ్బు వ్యవహారమని తెలుస్తే ప్రణయం, గిణయం ఉండవు. అందుకని ఆ ప్రణయం తాలూకు ఆకర్షణను నిలిపేందుకు, ఈ డొంక తిరుగుడు పద్ధతి అనుసరించారు. ఇక వాడున్నా డంటే, వాడి దుస్తులతీరూ అదీ చూస్తే, పెద్దమనిషనే ఎవడైనా అనుకోక తప్పదు. వెనకాల ఇంత నీచం వున్నా, పెద్ద మనిషితో జరిగే వ్యవహారంగానే కనిపిస్తుందంతా" శంకర్ కథ ముగించి, హాయిగా కూర్చున్నాడు.

నాకు గుర్రుగానే వుంది– చెప్పొద్దూ... ముందుగా ఇదంతా తెలుసుకున్నాను కనుక, సస్పెన్సు లేకుంటేనేం, ఆ అనుభవం పొందలేక పొయ్యానే అనే దిగులు వుండనే వుంది. అంతకన్న, ఆమె ఇంటికి వొస్తుందేమోననే అనుమానం మనసులో కలుక్కుమంటూ వుంది.

"నువ్వెంత చెప్పినా ఆమె ఇంటికి వొస్తుందేమోరా!" అన్నాను.

"వొస్తేరానీ–" అన్నాడు వాడు చిరాగ్గా.

"ఔను. వొస్తే నీకేం? నీ ఇంటికి కాదుగా!"

"సారీ! ఆమె మీద కోపంతో అలా అన్నాను... మళ్ళీ వాడెక్కడ కనిపిస్తాడోనని బెరుగ్గానేవుంది. కాని, దారి తప్పించి ఎదురు పేవ్‌మెంట్ మీదనే నడుస్తున్నా, ఒక

పక్క కనిపెడుతున్నా. అదృష్టవశాత్తూ వాడు మళ్ళీ కనిపించలేదు. అసలు అక్కణ్నుంచి డేరా పీకేసి, ఇంకెక్కడన్నా వేసి వుంటారనుకుంటాను–" అన్నాడు వాడు.

ఇది నాకొక రకంగా జవాబు చెప్పినట్లని వాడి అభిప్రాయం. ఈ మొబయిల్ వ్యాపారస్థులు నాదాకా రారని హామీ అన్నమాట! కాని, వాడు మళ్ళీ కనిపిస్తే, నేను కూడా ఒకసారి వాడితో వెళ్ళివొస్తే బాగుండుననుకుంటున్నాను. ఆ ఆశ కాస్తా ఆరిపోయింది. అంత అదృష్టంవుంటే శంకర్‌కన్న ముందుగా నా చేతుల్లోకి వొచ్చిందాన్ని జారవిడుచుకుంటానా?

ఇలాగే ఆలోచిస్తూ ఇంటికి వెళ్ళాను.

## 2

మూడోరోజున శంకర్ దగ్గర్నుంచి ఉత్తరం వొచ్చింది. సాధ్యమైనంత త్వరలో వొచ్చి తన్ను చూడమని, చూడవలసిన చోటు ఎడ్రస్ రాశాడు. నా కంతా అగమ్యగోచరంగా వుంది. వీడుకాని, ఆ శకుంతలను ఎక్కడన్నా జేర్చాడేమో? ఇదే నిజమైతే, ప్రాణమిత్రుణ్నయిన నాకు కూడా కొంత అవకాశం వుంటుంది. ఈ తలపే నాలో విపరీతంగా పనిచేయసాగింది. వాడు కథ చెప్పిన రోజునుంచీ ఆ సుందరాంగిని తలుచుకుంటూ తహతహలాడిపోతున్నాను. శంకర్ అదృష్టానికి ఈర్ష్యపడుతూ, నా దురదృష్టాన్ని ఆడిపోసుకుంటూనే వున్నాను. అలాటి సమయంలో ఈ చల్లని వార్త వొచ్చింది.

ఎందుకైనా మంచిదని ఒక గంట ముందుగానే ఆఫీసు వొదిలి, అనుకున్నదానికన్న ముందుగానే వాడిచ్చిన ఎడ్రస్‌కు జేరాను. అక్కడ ఎవరో కుర్రాణ్ని అడుగుతే, మేడమీదికి పొమ్మన్నాడు. ఆతృతతో పైకి వెళ్ళాను.

లోపల వాడు దాంతో కులుకుతూ వుంటాడనుకున్నాను. కాస్త ఆగి అటూ, ఇటూ చూశాను– ఎక్కడన్నా చీరె కుచ్చెళ్ళు కదలటం కనిపిస్తుందేమోనని. ఏం లేదు... పేరుపెట్టి పిలిచాను, తొందరపడి లోనికి ప్రవేశించకుండా.

"ఉస్... అబ్బ... రారా బాబూ!" శంకర్ గొంతేకాని, చాలా నీరసించి వుంది.

లోపలికి వెళ్ళాను. మంచంమీద పడుకొని వున్నాడు. వారంరోజులు లంకణాలు కట్టినవాడల్లే వున్నాడు. ఐతే వీడికి వొంట్లో బాగుండకపోతే, ఇంట్లో ఉండక ఇక్కడికి మకాం మార్చాడెందుకూ?

"కూర్చో" అన్నాడు.

పక్కనే వున్న కుర్చీలో కూలబడ్డాను.

"ఏమిటిదంతా?" అన్నాను.

ఫాలభాగంమీద మొత్తుకున్నాడు "ఖర్మ" అన్నట్లు.

"ఏమైందో చెప్పరా!" అన్నాను.

"ఏముందీ – నీకు చెప్పానుగా ఆ వ్యవహారం... దాని ఫలితం" అన్నాడు శంకర్. "ఏదో మంచి అనుభవం జరిగిందికదానని మురుస్తూ వుంటే, ఆమె నాకు తెలియకుండానే ప్రసాదించిన ఈ సుఖవ్యాధులు–"

నేను అదిరిపొయ్యాను. "దివ్యాంగన" అనీ "హృదయరాణి" అనీ ఇలాటిపేర్లేమో పెట్టాడామెకు. అలాటి ఇల్లాలిదగ్గిరనుంచా ఈ దిగుమతి? ఏమోలే– పైకి అందంగా, స్వచ్ఛంగా కనిపిస్తూ, సువాసనల్ని వెదజల్లే గులాబికి ముళ్ళుండటంలో అబ్బురం ఏమిటి?

"ఇంట్లో తెలిసిపోతుందేమోనని స్నేహితుడి గదికి జేరాను. ఆఫీసు పని మీద పదిరోజులు క్యాంప్ వుందని బొంకి, సెలవుపెట్టి మంచంపట్టాను" అన్నాడు శంకర్ నీరసంగా.

నాకు షాక్ తగిలినట్లయింది. ఆమెను ఊహించుకొని నేను కనిన కలలన్నీ, సముద్రపు టలలవలె, కరిగిపోయినవి. వాటిస్థానే చిన్న భూకంపాలు, తుఫానులు కనిపిస్తూన్నవి. అవి కలలుగానే వుంటే, ఎంతకాలమైనా సరే ఆకర్షణ చెడకుండా, దమ్మిడీ ఖర్చులేకుండా, సుఖరోగాల భయంకానీ, బాధకానీ లేకుండానే ఉండొచ్చు. తీరా అనుభవించాక పతనమయ్యామనే మనోవ్యాకులత కూడా ఉండదు.

"దీని దుంపతెగ – ఎంతపని చేసిందీ!" అన్నాను, ఆమె మీద కారాలూ, మిరియాలూ నూరుతూ.

"అదే ఆలోచిస్తున్నాను... కాని ఆమె మాత్రం ఏం చేస్తుందిలే! ఆమెకు వీటిని మనకన్న ముందొచ్చినవాడు ప్రసాదించి వుంటాడు. కావాలని ఆమె స్వీకరిస్తుందా? అందువల్ల ఆమె వ్యాపారానిక్కూడా నష్టమే కదా!" అన్నాడు శంకర్.

నేనేదో ఉద్రేకం మీద ఆమెను ఆడిపోసుకుంటున్నాను కాని, శంకర్ జాగర్తగా ఆలోచించినట్లే వున్నాడు. అందుకనే వాడి మాటల్లో సత్యం ధ్వనిస్తోంది.

"అందుకనే యీ చెడు తిరుగుళ్లు వొద్దనేది. బుద్ధిలేకపోతే సరి!" అన్నాను. ఇంతకు పూర్వం శంకర్‌లాగు బతకలేని నా అసమర్థతను నిందించుకున్న నేను, ఇప్పుడు వాణ్ని ఏవగించుకుంటున్నాను. వాడి బతుకును దూషించే అధికారాన్ని సంపాయించాను.

"యీ నీతులకేంలే" అన్నాడు వాడు. "నేను అందుకు విచారించను. మంచి అనుభవానికి ఇది పెనాల్టీ అనుకుంటాను. అదికాదు, ఎవరికన్నా తెలుస్తే, నలుగురు బిడ్డల తండ్రికి, ఇదేం పొయ్యేకాలం అంటారని భయం" అన్నాడు వాడు. ఒకరకంగా

వాడు తిరిగి ఆత్మబలాన్ని పొందినట్లే వున్నాడు. ఏం చేస్తాడుమరి? దిగజారటంవల్ల లాభంలేదని తెలుసాయె.

"ఎప్పటికి బైటపడతావ్?" అన్నాను.

"ఇప్పటికి అరవై లక్షలు ఎక్కింది. రేపటికి కోటికి పడగెత్తవొచ్చు. రెండో కోటితో..."

"ఏమిటి - రామకోటా?" అన్నాను.

"నీకు బొత్తిగా తెలియదేం? పెన్సిలిన్! మనలాటి బాధిత మానవ ప్రపంచాన్ని దృష్టిలో పెట్టుకొని, శాస్త్రజ్ఞులు కనిపెట్టిన మందులు... బహుశా మరో వారంలో కోలుకుంటాను-"

"ఇకనన్నా బుద్ధికలిగి వుండు... యీసారి ఆమె కనిపిస్తే-" అన్నాను.

"కనిపిస్తే తప్పకుండా అనుభవిస్తాను" అన్నాడు.

ఇంత మొండివెధవేం?

"ఇంకా బుద్ధిరాలేదన్నమాట!"

"ఆమె దగ్గిర్నుంచి మనకేం రావోయ్ ఇంక. అందుకనే భయం లేదు-"

"ఏం? ఎందుకనీ?"

"ఇమ్యూన్ అవుతాను... ఇదంతా కనుక్కున్నానులే!" అన్నాడు వాడు ఉత్సాహంతో.

"అంతేలే... యీ వెధవ ధైర్యంతో దూకు. ఈసారి ఆపరేషన్ కూడా ఐతే... ఐనా బుద్ధిలేదేరా నీకు?" అన్నాను.

"ఎందుకోయ్ బుద్ధి? ఇదంతా నీకు చెప్పాను కనుక కాని, ఇంకెవరికన్నా తెలుస్తుంది కనుకనా?"

ఒకసారి జైల్లో పడ్డవాడికి, జైలంటే లక్ష్యం వుండని మనస్తత్వం ఏర్పడింది వీడిలో. ఎలా చూసినా వీడే మొగాడా అని పీకుతోంది నాకు.

"ఇలాటి వ్యవహారాలకు దూరంగా వున్నవాడు అదృష్టవంతుడనుకో. దిగాక అంతు తేల్చుకోవా లనుకునేవాడికి ముక్తి వుండదు" అన్నాడు వాడు.

అమ్మయ్య! నేను అదృష్టవంతుణ్నే అనుకున్నాను. కాదామరి? ఈ రొంపిని చూస్తూ చూస్తూ దూకటంలో అర్థ మేమిటి? ఒకప్పుడు శంకర్ అదృష్టవంతుడనుకొని ఈర్ష్యపడ్డాను. అదే పదివేలు, శంకర్‌చేత "సెబాస్" అనిపించుకున్నందుకు ధన్యుణ్ని.

నా అదృష్టానికి వొళ్ళు పులకరించి, నిట్టూర్పు ద్వారా బైటికి కక్కాను.